ప్రజాశక్తి

ఆదివారం 12 మార్చి 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

ఉత్తరాంధ్ర శాసన మండలి

ప్రచారానికి తెర.... ప్రలోభాలతో ఎర..

- 11తో ముగిసిన ప్రచారం... 13న పోలింగ్... 16న ఫలితాలు
- ఏర్పాట్లలో అధికార యంత్రాంగం
- కులం, ధనం, గిఫ్ట్ ప్యాక్‌లతో చెలరేగిపోతున్న అధికార వైసిపి, ఇతర పక్షాలు
- ప్రభంజనంలా పిడిఎఫ్ ప్రచారం... ◆ ముందంజలో డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం శాసన మండలికి ఈ నెల 13న జరుగనున్న ఎన్నికల ప్రచారానికి శనివారం సాయంత్రం 4 గంటలతో గడువు ముగిసింది. ఇంకా 24 గంటల వ్యవధే పోలింగ్‌కు ఉంది. సోమవారం ఉదయం 8గంటలకు ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో అన్ని చోట్లా ఎన్నికల్లో పట్టభద్రులు పాల్గొననున్నారు. ఈ జిల్లాల్లో 2,89,214 మంది ఓటర్లు ఎమ్మెల్సీగా తమ అభ్యర్థిని ఎన్నుకోనున్నారు. ప్రోగ్రెసివ్ డెమక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ప్రచారం ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రభంజనంలా సాగింది. ప్రజా సంఘాల శ్రేణులు విస్తృతంగా పిడిఎఫ్ అభ్యర్థి పేరును పట్టభద్రుల్లో ప్రచారం చేయడంతో ఆమె ముందంజలో ఉన్నారనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అనేక సంవత్సరాలుగా ఉత్తరాంధ్ర జిల్లాలను పీడిస్తున్న ప్రధాన ప్రజా సమస్యలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, మహిళా రంగాలకు చెందిన అంశాలే అజెండాగా పిడిఎఫ్ చేపట్టిన ప్రచారం సర్వత్రా ఆమోదయోగ్యంగా నిలిచింది.

ఎమ్మెల్సీ బరిలో ప్రధాన రాజకీయ పార్టీలు...

ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, తెలుగుదేశం, బిజెపికి చెందిన అభ్యర్థులు బరిలో ఉండడం ఈ దఫా ఒక ప్రత్యేకతగా ఉంది. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి పివిఎన్ మాధవ్‌కు తెలుగుదేశం మద్దతు ఇవ్వడంతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా మాధవ్ గెలిచాడు. ఈ సారి ఈ రెండు పార్టీలు వేర్వేరుగా బరిలోకి దిగాయి. దీంతో రూ.కోట్లు ఖర్చుపెట్టి నెగ్గే పనిలో బిజెపి నిమగ్నమైంది. కేంద్రంలో తమ బిజెపి అధికారంలో ఉండడం, రూ.కోట్లు కూడబెట్టుకున్న నేతలకు కొదవు లేకపోవడంతో మాధవ్‌కు నిధులు కూడా వస్తున్నాయన్నది ఇంటెలిజెన్స్ తాజా నివేదికగా ఉంది. తెలుగుదేశం అభ్యర్థి చిరంజీవిరావు కూడా రూ.కోట్ల ఖర్చు చేసేందుకు అన్నీ సిద్ధం చేసుకున్నాడు. గత ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి బరిలో లేడు. ఈ సారి రియల్ ఎస్టేట్ వ్యాపారి సీతంరాజు సుధాకర్‌ను ఆ పార్టీ ఉత్తరాంధ్రలో పోటీకి దింపింది. రూ.కోట్ల ఖర్చుతో గట్టెక్కాలని ఇప్పటికే సదరు వ్యక్తి ఓట్ల నమోదులోనూ డబ్బులు పంపకాలకు పాల్పడ్డారు.

ప్రధాన పార్టీల ప్రలోభాలను తిప్పికొట్టనున్న పట్టభద్రులు

'నమ్మకు

మిగతా 2లో..

ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశామని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. శనివారం సాయంత్రం కలక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 13వ తేదీన జరగబోయే ఎన్నికలకు సర్వం సిద్ధం అయిందన్నారు. 13వ తేదిన ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉమ్మడి విశాఖ , విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో మొత్తం 331 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని చెప్పారు. సుమారు 2,89,214 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని, 96 శాతం మంది ఓటర్లకు స్లిపులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్ దగ్గర వెబ్ కాస్టింగ్ ఏర్పాటుచేసినట్లు చెప్పారు. 48 గంటల ముందు నుంచి డ్రైడే గా పాటించడం జరుగుతుందని, ఆ సమయంలో మద్యం దుకాణాలు మూసివేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ మెటీరియల్‌ను ఆయా జిల్లాల నుంచి పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు. పోలింగ్ సిబ్బంది మెటీరియల్ సెక్యూరిటీతో బయలు దేరి పోలింగ్ స్టేషన్ చేరుకుని, పోలింగ్ అనంతరం

మాట్లాడుతున్న కలెక్టర్, పోలీసు కమిషనర్

తిరిగి స్వర్ణభారతి స్టేడియంలో నిబంధనలు మేరకు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచడానికి చర్యలు చేపట్టామన్నారు. 16వ తేది ఉదయం 8.00 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుందన్నారు. ఎన్నికలు నిర్వహించే కార్యాలయాలకు ఈ నెల 12, 13 తేదీల్లో ప్రత్యేక సెలవు దినంగా ప్రకటించినట్లు చెప్పారు. పట్టభద్రుల ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఓటరు పనిచేసే కార్యాలయాలు, ప్రైవేటు యాజమాన్యాలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పర్మిషన్ మంజూరు చేయాలన్నారు. ఓటరు ఓటు వినియోగించే సమయంలో 1,2,3,4,5 మాదిరిగాగానీ, రోమన్ నెంబర్లు I ,II ,III, IV, V గాగానీ ఓటు వేయాలని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపిని ఓడించాలి : అయ్యన్న

పేజీ 7లో

మద్దిలపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న కోరెడ్ల రమాప్రభ

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా...

డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలించాలని కోరుతూ శనివారం ఉదయం ఎయు ఇంజినీరింగ్ కాలేజ్, మద్దిలపాలెం ఆర్‌టిసి బస్‌స్టాండ్ వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ మాట్లాడుతూ, పిడిఎఫ్ విలువలకు, నీతి, నిజాయతీకి కట్టుబడి ఉద్యోగ, కార్మిక, ప్రజా సమస్యలపై కౌన్సిల్‌లో పోరాడుతోందన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రభుత్వం బంజార హిల్స్‌లో ఇచ్చిన ఇచ్చిన 500 గజాల ఇళ్ల స్థలాలను తిరస్కరించారని తెలిపారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు వస్తున్న వేతనాలను కూడ ప్రజా సంఘాల ఉద్యమాలకు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్సీలలో 58కిగానూ 48 రాజకీయ పార్టీల ప్రతినిధులే ఉంటారని, కేవలం 10 సీట్లు మాత్రమే పట్టభద్రులకు, ఉపాధ్యాయులకు కేటాయించారని తెలిపారు. ఆ స్థానాల్లో కూడా రాజకీయ పార్టీలు పోటీ చేస్తే పట్టభద్రుల, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ఎవరు

మిగతా 2లో..

THE ANAKAPALLE DIVISION POSTAL EMPLOYEES CO-OPERATIVE CREDIT SOCIETY LTD., NO.B-1952

Vivekananda Nagar, Opposite R.T.C. Complex, Anakapalle - 531 001

ELECTION NOTIFICATION

The Collector and District Magistrate / Election Authority, Anakapalle appointed Election Officer, to conduct Elections to the Anakapalle Division Postal Employees Co-operative Credit Society Ltd., No.B-1952, Anakapalle. The brief details of Election are as shown below.

Mode of Election Details	11 Directors under secret ballot paper
Receipt of Nominations	On 18-03-2023 from 10.00 A.M. to 04.00 P.M. at Society Office
Scrutiny of Nominations	On 19-03-2023 from 10.00 A.M. on wards at Society Office
Withdrawal of Nominations	On 20-03-2023 from 10.00 A.M. to 5.00 P.M. at Society Office
Date of Poll	On 26-03-2023 from 09.00 A.M. to 04.00 P.M. at District Co-operative Marketing Society Beside N.T.R. Stadium, Ankapalle.
Date of Counting & Declaration of Results	On 26-03-2023 after 04.00 P.M. at the place of poll
Date of Election of Office Bearers	On 27-03-2023 after 10.00 A.M. at Society Office

Note : For full details of the notification please see the Society Notice Board at Society Office.

(V.V.V.SATYA KUMAR)
ELECTION OFFICER

మొదటి పేజీ తరువాయి..

ఉత్తరాంధ్ర శాసనమండలి

ప్రచారానికి తెర.. ప్రలోభాలతో ఎర...

నమ్మకు ఈ రేయినీ...కమ్ముకు వచ్చే ఈ మాయనీ'...అన్న రీతిలో శనివారం రాత్రి నుంచి పెద్ద ఎత్తున ధన, బహుమతుల పంపిణీ మరింత పెరగనుంది. కానీ పట్టభద్రులంతా ప్రధాన పార్టీల డబ్బు మూటల పంపిణీ అజెండాను తిప్పికొట్టనున్నారు. ప్రచారంలో భాగంగా ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో అధికార వైసిపి ప్రలోభాలకు గురిచేసే చర్యలు ఎలా వేగవంతం చేసిందో తెలిసిందే. డబ్బు పంపిణీ, బహుమతులు, వెండి నాణేలు, చీరలు ఇతర సామగ్రి పంపిణీని పెద్ద ఎత్తున పట్టభద్రులకు ఇవ్వజూపింది. తెలుగుదేశం కూడా ఇదే తోవలోనే నడుస్తోంది. బిజెపి నుంచి సిట్టింగ్ అభ్యర్థే రంగంలో ఉండడంతో పెద్ద ఎత్తున ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నారు.

ప్రభంజనంలా పిడిఎఫ్ ప్రచారం...

వీటన్నిటికీ భిన్నంగా డాక్టర్ కోరెడ్ల రమాప్రభ 40వేల మందికి పైగా పట్టభద్రులైన ఓటర్లను ప్రత్యక్షంగా కలిసి ఓటును కోరడం ఈ ఎన్నికల్లో ఓ ప్రత్యేకత. ఉమ్మడి జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల్లోకి సైతం ఈమె గళం వెళ్లింది. దీంతో సర్వత్రా పిడిఎఫ్ అభ్యర్థికి పట్టభద్రులు బ్రహ్మరథం పడుతున్నారు. 250 ప్రజా సంఘాలు బలపరచిన వ్యక్తిగా ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో ఈమె పేరు మార్మోగుతోంది. నిరుద్యోగ పట్టబద్రులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మహిళా ఓటర్ల నోటా రమాప్రభ మాటగా వినిపిస్తోంది. ఇలా బరిలో నిలిచిన అంత మంది అభ్యర్థుల దాటుకుంటూ ఓ మహిళా అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ పేరు ముఖ్యమంగా వినిపిస్తుండటంతో అధికార పార్టీ వెన్నులో వణుకు ప్రారంభమైంది. దీంతో పట్టభద్రులను ప్రలోభాలకు గురిచెయ్యాలనే తపనతో వైసిపి శ్రేణులను, బయట నుంచి కిరాయికి తెచ్చుకున్న యువతను వినియోగిస్తూ అక్రమాలకు పాల్పడడంలో వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ అందెవేసిన చెయ్యిగా నిలిచారు. చాపకింద నీరులా బిజెపి అభ్యర్థి పివిఎన్ మాధవ్ విశాఖలోని ఆ పార్టీ కార్యాలయం నుంచే పంపిణీకి శ్రీకారం చుట్టారు.

డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలి

ప్రశ్నిస్తారన్నారు. ప్రజా సంఘాల ఉమ్మడి అభ్యర్థిగా పోటీచేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎయు మాజీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కెఎస్.కోటేశ్వరరావు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.జగన్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు పడాల రమణ, వామన మూర్తి, గోవింద్, మోటార్ ట్రాన్స్‌పోర్టు యూనియన్ నాయకులు శ్రీరాములు, వివిధ ప్రజా సంఘాల నాయకులు జిఎస్.రాజేశ్వరరావు, చలపతి, పి.అప్పారావు, కుమారి, ఎల్‌జె.నాయుడు, తులసి, వెంకటరావు, బొడ్డు దేముడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు : సిపి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఉత్తరాంధ్ర పట్టుభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరిగేలా, ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకొనేలా బందోబస్తును ఏర్పాటుచేసినట్లు విశాఖ నగర పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ తెలిపారు. శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, నగరంలోని 43 లొకేషన్లలో 112 పోలింగు కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. 43 పోలింగు కేంద్రాల వద్ద ఎస్ఐ స్థాయి అధికారిని నియమించామని, బందోబస్తు ఏర్పాట్లను నిరంతరం ముగ్గురు డిసిపిలు పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. బందోబస్తు నిమిత్తం ముగ్గురు డిసిపిలు, ఇద్దరు ఎడిసిపిలు, 10 మంది ఎసిపిలు, 21 మంది సిఐలు, 83 మంది ఎస్ఐలు, 201 మంది ఎఎస్ఐ/హెచ్‌సిలు, 405 మంది సివిల్ కానిస్టేబుళ్లు, 142 మంది మహిళా కానిస్టేబుళ్లు, 148 మంది హోం గార్డులు, 133 మంది ఆర్మ్‌డ్ రిజర్వు సిబ్బంది, రెండు ఎపిఎస్‌పి ప్లటూన్లను వినియోగించనున్నట్లు తెలిపారు.

ఎన్నికలు పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకుగానూ 15 రూట్ మొబైల్స్, సిఐ స్థాయి అధికారి పర్యవేక్షణలో 15 స్ట్రైకింగు ఫోర్సులను, ఎసిపి స్థాయి అధికారి పర్యవేక్షణలో 6 స్పెషల్ స్ట్రైకింగు ఫోర్సులను, 20మంది ఉండే 3 రిజర్వు ఫోర్సులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో 6 చెక్ పోస్టులను ఏర్పాటుచేసి నిరంతరం వాహనాల తనిఖీలు చేపడుతున్నామనీ, 12 ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో ఓటింగ్ సమయంలో నిరంతరం పర్యవేక్షిస్తామనీ, 6 షాడో టీంలతో ఎల్లవేళలా నిఘా ఉంటుందని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటుచేసిన స్వర్ణ భారతి స్టేడియం వద్ద ఎసిపి స్థాయి అధికారితో 77 మంది సిబ్బంది, 2 ఎపిఎస్‌పి ప్లటూన్లతో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పోలింగు కేంద్రాలు వద్ద 144 సిఆర్‌పిసి, సెక్షన్ 30 పోలీసుచట్టం అమలులో ఉంటున్నందున ఎవ్వరూ గుంపులుగా ఉండవద్దని, ప్రజలందరూ భద్రతా సిబ్బందికి సహకరించాలని కోరారు. పోలింగు కేంద్రాలకు 100మీటర్లు దూరంలో ఎటువంటి టెంటులు వేయకూడదన్నారు. రెవెన్యూ సిబ్బంది సహకారంతో లైన్లు ఏర్పాటు చేయాలనీ అధికారులకు అదేశించారు.

అధికార బలహీనత!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'అధికార వాంఛ బలం నుంచి కాదు, బలహీనత నుంచే ఉద్భవిస్తుంది".. అని ఎరిక్ ఫ్రామ్ అనే జర్మన్ సైకాలజిస్టు మాటలు ప్రస్తుత ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల సందర్భంగా ప్రధానంగా అధికార వైసిపికి, ఇతర పార్టీలైన టిడిపి, బిజెపిలు అవలంభిస్తున్న అక్రమ మార్గాలు చూస్తే అక్షరాలా నిజమేనని అనిపించక మానదు. అదే సందర్భంలో ప్రజా సంఘాల మద్దతుతో కొన్ని రోజులుగా విలక్షణమైన పద్ధతుల్లో నిరాడంబరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ వస్తోన్న పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు ఇంకా కొద్దిరోజుల్లో దక్కనున్న ఫలితం దిశగా చూస్తే అమెరికన్ సంఘసంస్కర్త హెచ్‌డబ్ల్యూ (హెన్రీ వార్డ్) బీచర్ మాటలు "సులభంగా లభించే విజయం సంతృప్తికరంగా ఉండదు.. కఠోర పరిశ్రమ అనంతరం వరించే విజయం తియ్యగా ఉంటుంది..' అన్న వ్యాఖ్యలు నిజం చేసేలాగ ఉన్నాయనడంలో ఎలాంటి సందేహం లేదనే చెప్పాలి. ఈ నెల 13న జరుగనున్న ఉమ్మడి ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల పోరు సాగనుంది. ఫలితాలు కూడా పై వ్యాఖ్యలకు తగ్గట్టుగానే రానున్నాయనేది వినికిడి. ఓట్లేసే వారంతా బాగా చదువుకున్న వారు, ఉద్యోగాలు చేసేవారు, మేధావులు కావడంతో ప్రధాన పార్టీల పాచికలు ఇక్కడ పారే అవకాశాలు తక్కువ. అధికారం దక్కదనే బలహీనమైన ఆలోచనలతో వీరినీ ప్రలోభాలకు గురిచేసే వ్యూహాలు పన్నుతున్నాయి.

'ధన' ప్రవాహమే ప్రధాన పార్టీల కార్యాచరణ...

మునుపెన్నడూలేని రీతిలో సాధారణ ఎన్నికల్లో బరిలో నిలిచే వైసిపి, తెలుగుదేశం, బిజెపి కూడా ఈ శాసన మండలి ఎన్నికలకు 'తగుదునమ్మా' అంటూ పెద్ద ఎత్తున ప్రలోభాలకు గురిచేస్తూ ఎలాగైనా తమ అభ్యర్థిని గెలిపించుకోవాలన్న తాపత్రయం కనిపిస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాల సమస్యలేవీ వారి అజెండాలో మచ్చుకైనా కానరావడం లేదు. ఉత్తరాంధ్ర

సుజల స్రవంతి ఊసు పట్టదు. వాల్తేరు రైల్వే డివిజన్‌ను ఎత్తేస్తే మాట్లాడరు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ విశాఖ కేంద్రంగా కేంద్రం ప్రకటించి ఇవ్వకపోతే పోరాడరు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తుంటే గొంతుకలు మూగబోతాయి. ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాలన్నిటినీ ఒక ప్రత్యేక ప్రాంతంగా గుర్తించి బుందేల్‌కండ్ తరహా ఆర్థిక ప్యాకేజీ ఇస్తానంటూ కేంద్రంలోని బిజెపి చేసిన బాసలు ఢిల్లీ గద్దెనెక్కి తుంగలోకి తొక్కినా ఏ పార్టీ ప్రశ్నించదు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని చిన్న నీటి సాగు వనరుల పరిరక్షణ, ప్రాజెక్టుల నిర్మాణంపైనా అధికారంలోని వైసిపి ఒక్కపైసా నిధి కేటాయించలేదు. ఇదీ అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం, బిజెపిల తీరు.

సమస్యలపై నిర్మాణాత్మక ప్రసంగాలు... ప్రచారంలో నిరాడంబరత, విలక్షణత

ఉమ్మడి జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో గడచిన కొద్ది రోజులుగా పట్టభద్రులను కలుసుకుంటూ సమస్యలపై తన అజెండాను సిద్ధం చేసుకుని, నిర్మాణాత్మక పరిష్కారాలను చూపుతూ సాగుతున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభ శైలి పట్టభద్రులను ఆకట్టుకుంటోంది. 250 ప్రజా సంఘాలకు చెందిన శ్రేణులు సాగించే ప్రచారం, విలక్షణతతో పిడిఎఫ్ దూసుకుపోయిందనే చెప్పాలి. మామూలు ఎన్నికల దృష్టితో చూస్తూ ప్రలోభాలకు పాల్పడుతున్న ఈ రాజకీయ పార్టీలతో పోటీ పడడం అనేది పిడిఎఫ్‌కు అత్యంత కత్తిమీద సాము, అతిపెద్ద సాహసమే కాగలదు. అయితే మరోమాటగా చెప్పాలంటే ఈ పార్టీల పరిస్థితిని, ప్రచార సరళిని ఉత్తరాంధ్ర అంతా (పట్టభద్రులు) చూస్తోంది. అధికారం రుచిచూసిన పార్టీలు ఈ ఎన్నికలను డబ్బు మయం చేసేసి నెగ్గాలన్నదే కాంక్షగా కనిపిస్తోంది. శాసన మండలికి మేధావులను పంపించి ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సమస్యలపై సహృద్భావ వాతావరణంలో చర్చలు సాగించాల్సిన వేదికకు రూ.కోట్లు ఖర్చుపెట్టి ఎన్నికల్లో గెలిచే వారిని పంపించాలని చూడడం నిజంగా విచారకరం.

హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సెలవు మంజూరు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఈ నెల 13న హెచ్‌పిసిఎల్‌లోని పర్మినెంట్ ఉద్యోగులకు మాదిరిగానే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఓటు హక్కును వినియోగించుకునేందుకు సెలవు ఇవ్వాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి విజ్ఞప్తి చేశారు. హెచ్‌పిసిఎల్ యాజమాన్యం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న పర్మినెంట్ ఉద్యోగులకు మాత్రమే 4 గంటలు అనుమతి ఇచ్చారని తెలిపారు. ఆ పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కంప్యూటర్ ఆపరేటర్స్, టెక్నీషన్స్, మెయింటెనెన్స్‌లో పనిచేస్తున్న వారికి సెలవు ప్రకటించలేదన్నారు. దీనిపై కార్మికులు అడిగితే అనుమతి ఇవ్వబోమని చెబుతున్నారని తెలిపారు. యాజమాన్యం అనుమతి ఇవ్వకపోతే ఓటు హక్కు వినియోగించకోవడం సాధ్యం కాదన్నారు. ఇది ఎన్నికల నిబంధనావళికి వ్యతిరేకం కనుక ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంటనే జోక్యం చేసుకొని హెచ్‌పిసిఎల్ యాజమాన్యానికి తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారికి లేఖ అందజేశారు.

పోలింగ్‌కు ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బంది కేటాయింపు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 6 జిల్లాలలో గల అన్ని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బందిని కేటాయిస్తూ ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున నిర్వహించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు సిద్దార్థ్ జైన్, సంబంధిత జిల్లాల అధికారుల సమక్షంలో నిర్వహించారు. విశాఖ జిల్లాలో 112 కేంద్రాలు, అనకాపల్లి జిల్లాలో 49, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 15, విజయనగరం జిల్లాలో 72, పార్వతీపురం మన్యం జిల్లాలో 24, శ్రీకాకుళం జిల్లాలో 59 పోలింగ్ కేంద్రాలకు పీవోలు, ఏపీవోలు, మైక్రో అబ్జర్వర్స్‌కు పోలింగ్ విధులకు ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాసమూర్తి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

707వ రోజుకు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 707వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఎఫ్‌టియుఐ మత్స్యకార మహిళలు కె.లక్ష్మి, ఎం.లక్ష్మి, జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆగని వైసిపి ప్రలోభాలు

ప్రజాశక్తి ఎంవిపి కాలనీ : రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని నీలమ్మ వేపచెట్టు ప్రాంతంలో శనివారం సాయంత్రం వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ అనుచరులు పట్టభద్రుల ఓటర్లకు డబ్బులు పంచారు. ఈ విషయం తెలుసుకున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మద్దతుదారులు అక్కడికి చేరుకోవడంతో సుధాకర్ మద్దతుదారులు పరుగుతీశారు. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మద్దతుదారులు వై.రాజు, ఎం.సుబ్బారావు మాట్లాడుతూ, అధికార వైసిపి ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ఇలా ప్రలోభాలకు పాల్పడడం సరికాదన్నారు. సుమారు రూ.3 వేలు చొప్పున వైసిపి నాయకులు పంచారని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి ప్రలోభాలకు పాల్పడుతోందని బిజెపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు ఎం.రవీంద్ర ఆరోపించారు. బిజెపి కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అధికార పార్టీ వెండి బిస్కెట్‌లతో ఓటర్లను ప్రలోభపెడుతుందన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నా వైసిపి ఫ్లెక్సీలను అధికారులు తొలగించడం లేదన్నారు.

విపత్తుల ఎగ్జిబిషన్‌లో మేయర్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విపత్తులు సంభవించినప్పుడు నివారణ కోసం ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించామని విశాఖ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. శనివారం ఆమె ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన జాతీయ విపత్తుల నివారణ సదస్సులో రెండో రోజూ పాల్గొన్నారు. అక్కడ వివిధ రాష్ట్రాలు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించడంతో పాటు ప్రతినిధులను విపత్తుల నివారణపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ముంబయి కేంద్రంగా టాటా గ్రూప్ ప్రతినిధి సారంగతో కలిసి విశాఖలోనూ పీపీపీ పద్ధతిలో విపత్తుల నివారణలో ప్రభుత్వ అనుమతి తీసుకొని కలిసి పని చేసేందుకు చర్యలు ప్రారంభిస్తామన్నారు. ధ్రువ ఈఏసీ కంపెనీ డ్రోన్లను ఉపయోగించి తీర ప్రాంత రక్షణకు సర్వే చేసేందుకు చర్యలు తీసుకుంటామని, తీర ప్రాంతం వెంబడి ప్రమాదం ఉన్నచోటల్లా ప్రజల్ని అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. భారత్‌లో విశాఖలోనే తొలిసారి డ్రోన్లను ఉపయోగించి తీర ప్రాంత భద్రత కోసం చర్యలు చేపడతామని మేయర్ స్పష్టం చేశారు.

నోటీసు

మహారాజశ్రీ కొవ్వూరు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, కొవ్వూరు

E.P. No. 4/2021
O.S. No. 308/2019

బిట్వీన్:
శ్రీ గంగిశెట్టి శ్రీను **-పిటీషనర్/వాది**
మరియు
శ్రీమతి పింట్ల @ పెద్దింట్ల భవాని **-రెస్పాండెంట్/ప్రతివాది**

పై నెంబర్ పిటిషన్‌లో మీకు కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపించిననూ మీరు బుద్ధిపూర్వకంగా తీసుకొనకుండా నిలువరించుచున్నందున శ్రీ కోర్టు వారు సబ్‌స్టిట్యూట్ సర్వీసు ద్వారా ఆర్డర్ వేసినందున పై నెంబర్ పిటిషన్‌లో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల మీరు **ది. 15-03-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరయి తెలియజేసుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించడమగునని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

యాదాటి ప్రకాశరావు
స్థలం: కొవ్వూరు అడ్వకేట్, కొవ్వూరు
తేది: 12-3-23 తూ॥గో॥జిల్లా

ఎమ్మెల్సీ ఎన్నికల పోటీ అభ్యర్థులతో నేడు ఓపెన్ డిబేట్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులతో ఈ నెల 12న ఆదివారం ఉదయం 9.30గంటలకు ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో ఓపెన్‌డిబేట్ (ముఖాముఖి) నిర్వహించనున్నట్లు ఉత్తరాంధ్ర విద్యావంతుల వేదిక కన్వీనర్ ఆజాది కిషోర్‌కుమార్ తెలిపారు. ఉత్తరాంధ్ర విద్యావంతుల వేదిక, సహాయత వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యాన విశాఖలో దేశంలోనే తొలిసారిగా ఇటువంటి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఇటువంటి ఓపెన్ డిబేట్ నిర్వహించే సాంప్రదాయం ఉందని, అయితే మన దేశంలో తొలిసారిగా పోటీ అభ్యర్థులను నేరుగా ప్రశ్నించే వేదికను ఇక్కడ నిర్వహిస్తున్నామన్నారు.

ఈ ఓపెన్ డిబేట్‌లో ప్రధాన రాజకీయపక్ష నేతలతోపాటు స్వతంత్ర్య అభ్యర్థులు 38మంది పాల్గొంటున్నారని, తమ మ్యానిఫెస్టోను, కార్యాచరణను నేరుగా ఓటర్లకు వివరిస్తారన్నారు.నగరవాసులు ఈ డిబేట్‌లో పాల్గొనాలని కోరారు. సమావేశంలో వెంకటేశ్వర్‌రెడ్డి, వంశీ, శ్రీవిద్యా ఆశిత, శ్రీదీప్, డాక్టర్‌జ్ఞానానంద, శ్రీధర్, రూపేష్, ప్రసాద్, మాధవి సనారా పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ మరియు మ్యాచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఆరిలోవ సెయింట్ ఆన్స్ స్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. సంస్థలో ఉన్న వందలాది మంది మహిళలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి అతిథులుగా బిషప్ డాక్టర్ మల్లవరపు ప్రకాష్, సెయింట్ ఆన్స్ ప్రొవిన్షియల్ సుపీరియర్ సిస్టర్ సాంద్రిన్, కార్పొరేటర్లు మద్దిల రామలక్ష్మీ, అక్కరమాని రోహిణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని, తమ కాళ్లపై నిలబడి ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మహిళల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ అఫ్జాద్, సిస్టర్ నిర్మల, సిస్టర్ ఆన్ మరియ, ఏంజిల్ మేరీ పాల్గొన్నారు.

నేడు మహిళలకు విటమిన్ 'డి' పరీక్షలు

ప్రజాశక్తి - ఆరిలోవ :మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సేవా స్ఫూర్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో అపోలో డయాగ్నొస్టిక్ సౌజన్యంతో ఆదివారం రవీంద్రనగర్ సేవాస్ఫూర్తి భవనంలో మహిళలకు విటమిన్ డి పరీక్షలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు తెలిపారు. రూ.1850లు విలువ చేసే విటమిన్ డి పరీక్షలను కేవలం రూ.199లకే చేయనున్నట్లు తెలిపారు. పరీక్షలు చేయించుకున్నవారికి 100 గ్రాముల వుమెన్ హార్లిక్స్‌ను ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఊహామహంతికి సేవా పురస్కారం

ప్రజాశక్తి- సీతమ్మధార: విశాఖ ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో సామాజిక వైద్యుల సంఘం, కలాం ఫౌండేషన్ సంయుక్తంగా వివిధ రంగాల్లో విశేషసేవలు అందిస్తున్న 15 మంది మహిళలకు శనివారం పురస్కారాలను అందించారు. ఇందులో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో గిరిజన మహిళలు, బాలబాలికలు ఆరోగ్యం, స్వయంసమృద్ధిపై సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆర్‌డిడబ్ల్యూఎస్ సంస్థ డైరెక్టర్, యువ సామాజిక వేత్త ఊహా మహంతిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ గిరిజన గ్రామాలు, గ్రామీణ ప్రాంతాల్లో చైతన్య శిబిరాలు నిర్వహిస్తూ స్ఫూర్తివంతంగా ఊహా మహంతి పని చేస్తున్నారని కితాబు ఇచ్చారు.

గిరిజన సహకార సంస్థ చైర్మన్ శోభ స్వాతిరాణి ఊహా మహంతి సేవలను కొనియాడారు ఉత్తమ సంఘ సేవకురాలుగా పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఊహా మహంతి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు, మహిళలకు ఉపాధి కల్పనలో భాగంగా కుట్టు శిక్షణ వృత్తి నైపుణ్య శిక్షణ వంటి కార్యక్రమాలు చేపట్టి, అనేక మందికి ఆసరాగా నిలబడ్డామన్నారు. తన తాత, తండ్రి సురేష్ మహంతి నుంచి వారసత్వంగా సామాజిక సేవ బాధ్యతగా వచ్చిందన్నారు. కలాం ఫౌండేషన్ సామాజిక వైద్యుల సంఘం నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు

అసత్య ఆరోపణలపై అనిత ఫిర్యాదు

సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న అనిత

ప్రజాశక్తి -మధురవాడ : పీలేరులో మహిళా దినోత్సవం రోజున తాను మాట్లాడిన విషయాలను మార్ఫింగ్ చేసి తప్పుడు ప్రచారం, ట్రోలింగ్ చేస్తున్న వైసిపి సోషల్ మీడియా, సాక్షి ఛానల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎండాడలోని సైబర్ పోలీస్‌స్టేషన్‌లో తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ, తన ఆడియోను మార్ఫింగ్ చేసి వైసిపి నేతలు పైశాచికానందం పొందుతున్నారన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తనకు పంపినట్లుగా ఒక ఫేక్ లెటర్ సృష్టించి, దాంతో తాను ఏడుస్తున్నట్లు సోషల్ మీడియాలో ఫొటోలు రిలీజ్ చేశారన్నారు.దాన్ని ఎడిట్ చేసి సాక్షి ఛానల్ టెలీకాస్ట్ చేసిందని ఆరోపించారు. దీనిపై పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుకు వెళితే, రిపోర్టు తీసుకోకుండా కోర్టులో తేల్చుకోండంటూ అక్కడి ఎస్ఐ నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. దళిత మహిళనైన తనపై తప్పుడు ప్రచారాలతో సోషల్‌మీడియాలో వైసిపి శ్రేణులు ట్రోలింగ్ చేస్తుంటే సైబర్ పోలీసులు కూడా తమకు సంబంధం లేదనడం దుర్మార్గమన్నారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిని, దళిత మహిళ, మాజీ ఎమ్మెల్యే అయిన తన ఫిర్యాదునే పట్టించుకోకుంటే రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఉన్నట్లేనా అని ప్రశ్నించారు. సిఎం పర్యటనలకు వెళితే పరదాలు కట్టేందుకే అన్నట్లు పోలీసుశాఖ నిర్వీర్యం కావడం బాధాకరమన్నారు. తనపై ట్రోలింగ్ చేయిస్తున్న వైసిపి సోషల్ మీడియా ఇన్‌ఛార్జి భార్గవ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తామిచ్చిన ఫిర్యాదులకు పోలీసులు స్పందించని పరిస్థితుల్లో దీనిపై న్యాయపోరాటం చేస్తామని అనిత

జగనన్న లే-అవుట్‌కు భూములివ్వడమే నేరమా..?

అక్రమ కేసులు పెట్టడంపై నిర్వాసిత రైతుల నిరసన

పోలీస్‌స్టేషన్, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-పద్మనాభం : జగనన్న కాలనీ లేఅవుట్ల కోసం ల్యాండ్‌పూలింగ్‌లో రైతుల నుంచి సేకరించిన భూమికి బదులుగా ఇస్తామన్న ఇళ్ల స్థలాలను ఎపుడు, ఎక్కడ ఇస్తారో చెప్పాలంటూ నిర్వాసిత రైతులు ఆందోళన చేశారు. మూడేళ్లుగా ఇదిగోఅదిగో అంటూ సాగదీస్తున్న రెవెన్యూ అధికారుల వైఖరికి నిరసనగా శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి, తహశీల్దార్ కారును ముట్టడించారు.ఈ సందర్భంగా తమ నుంచి తీసుకున్న భూమిని వాపసు చేసుకోవాలంటూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

మండలంలోని తునివలస పంచాయతీ పరిధిలోని నర్సాపురంలో 74,76, 91 సర్వే నెంబర్ల పరిధిలోని 200 ఎకరాల భూములను ప్రభుత్వం జగనన్న లేఅవుట్ల కోసం రైతుల నుంచి సమీకరించింది. అప్పట్లో రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తే, సేకరించిన భూమికి పరిహారంతోపాటు భూమికి బదులుగా 450, 900 గజాల ఇళ్లస్థలాలను రైతులకు ఇస్తామంటూ అప్పట్లో ఒప్పందం కుదుర్చుకున్నారు. మూడేళ్ళ గడిచినా నిర్వాసిత రైతులకు ఇస్తామన్న స్థలాల కేటాయింపుపై పత్తా లేకపోవడంతో ఆందోళన చెందిన బాధిత నిర్వాసిత రైతులు పలుమార్లు దీనిపై అధికారులకు విన్నవించారు. ఎప్పటికీ స్పందన లేకపోవడంతో రైతులు ఆందోళన సన్నద్ధమౌతున్న పరిస్థితుల్లో స్థానిక నేతల అండతో భూములిచ్చిన రైతులపైనే అధికారులు కేసులు పెట్టారంటూ వారంతా ఆవేదన చెందుతున్నారు. దీనికి నిరసనగా శనివారం సుమారు 50మంది రైతులు పద్మనాభం పోలీస్‌స్టేషన్, స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఇళ్లస్థలాలకు భూములిచ్చిన పాపానికి తమపై కేసులు పెట్టడం దుర్మార్గమని, ఇప్పటికైనా అధికారులు స్పందించి భూములు సేకరించిన సమయంలో తమతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు స్థలాలను కేటాయించాలని, లేకుంటే ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

కంప్యూటర్ కోడింగ్‌పై 'గీతం'లో హ్యాక్‌థాన్

ప్రజాశక్తి -మధురవాడ: కంప్యూటర్ సైన్స్ కోర్సు అభ్యసించే విద్యార్థులలో కోడింగ్‌పై నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యాన శనివారం కోడ్ పర్స్యూట్ పేరిట హ్యాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆర్.శిరీష మాట్లాడుతూ ఐటి రంగంలో కోడింగ్‌కున్న ప్రాధాన్యత దృష్ట్యా విద్యార్థులు సంబంధిత అంశాలపై లోతైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రాంగణ నియామకాలలో గీతం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు పెద్ద ఎత్తున ఎంపిక కావడానికి కోడింగ్‌లో వారి సామర్థ్యమే కారణమన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు కోడింగ్‌పై క్విజ్, హ్యాకర్ ర్యాంక్, ర్యాపిడ్ ఫైర్ పోటీలను నిర్వహించారు. కోడింగ్ సమయంలో సమయానికి ఉన్న ప్రాధాన్యత కారణంగా టైమ్ మేనేజ్‌మెంట్‌పై విద్యార్థులకు ఈ పోటీలు ఉపయోగపడ్డాయని కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా గీతం విద్యార్థి విభాగం కార్యదర్శి డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సిఎస్ఐ అధ్యక్షుడు అభిజిత్, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు జోగేశ్వర్, మురళీకృష్ణ, ఉదయ ధనుష్ పాల్గొన్నారు.

వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -ఉక్కునగరం : 87వ వార్డు కళ్యాణ వెంకటేశ్వర స్వామి 23వ వార్షికోత్సవాలను ఈ నెల 31 నుంచి వచ్చే నెల 5వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శనివారం ఉత్సవాలకు సంబంధించి పోస్టర్లను ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ 31న చిన్న, పెద్ద శేషవాహనసేవ, 1న సూర్య, చంద్రప్రభ వాహనసేవ, 2న అశ్వ, గరుడ వాహనసేవ, 3న గజ వాహన సేవ, హనుమద్వాహన సేవ, 4న కల్పవృక్ష సేవ, రథోత్సవం, 5న అన్నసమారాధన ఉంటుందన్నారు.

పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-విశాఖపట్నం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ మెటీరియల్ పంపిణీ సక్రమంగా చేయాలని కలెక్టర్ మల్లికార్జున అధికారులకు సూచించారు. శనివారం స్వర్ణభారతి స్టేడియంలో పోలింగ్ మెటీరియల్ పంపిణీ కౌంటర్లు, సిసి కెమెరాల ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. భీమిలి ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి, విసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాధవి, తహశీల్దార్ శ్యామ్ ప్రసాద్,ఉన్నారు.

నేవల్ డాక్‌యార్డ్ సైకిల్ థాన్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నేషనల్ సేఫ్టీ వీక్ సెలబ్రేషన్స్‌లో భాగంగా విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డ్ సూపరింటెండెంట్ రియర్ అడ్మిరల్ సంజయ్ సాధు నేతృత్వంలోని అధికారుల బృందం రోడ్డు భద్రతపై అవగాహనకు సైకిల్ థాన్‌ను నిర్వహించారు. నేవల్ కోస్టల్ బ్యాటరీ నుంచి ఐఎన్ఎస్ కళింగ వరకు రహదారి, కార్యాలయం, ఇంటి వద్ద భద్రత ప్రాముఖ్యతపై పోస్టర్లను ప్రదర్శించారు. 'అవర్ ఎయిమ్ జీరో హామ్' అనే థీమ్‌తో వారం రోజుల కార్యక్రమం సైకిల్‌థాన్‌తో ముగిసింది.

నేరాలు ఘోరాలు

మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని

అత్తను హతమార్చిన అల్లుడు

- హనుమంతువాక విజయదుర్గా కాలనీలో ఘటన

రక్తపు మడుగులో నారాయణమ్మ మృతదేహం

ప్రజాశక్తి - ఆరిలోవ : మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో అత్తను ఇనుపరాడ్డుతో అత్యంత దుర్మార్గంగా అల్లుడే అంతమొందించిన ఘటన శనివారం ఉదయం ఆరిలోవ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హనుమంతువాక కొండవాలు ప్రాంతం విజయదుర్గా కాలనీలో చోటు చేసుకుంది. నిందితుడిని ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలివి.

హనుమంతువాక, విజయదుర్గా కాలనీలో నారాయణమ్మ(67) తన కూతురు, అల్లుడుతో నివాసముంటున్నారు. కూతురు గుండె సంబంధిత వ్యాధితో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పరిస్థితుల్లో, ఆమె అల్లుడు బాణాల రాము శనివారం ఉదయం మద్యం తాగేందుకు డబ్బులు కావాలని అత్తను వేధించాడు. డబ్బులు ఇవ్వలేదనే కక్షతో నారాయణమ్మను ఇనుప రాడ్డుతో కొట్టి, గోడకు గుద్ది చంపేశాడు. సమాచారం తెలుసుకున్న ఎసిపి మూర్తి, ఆరిలోవ సిఐ సోమశేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని రక్తపు మడుగులో పడి ఉన్న నారాయణమ్మ మృతదేహాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. నిందితుడు రామును ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఆటో నుంచి జారిపడి వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రయాణిస్తున్న ఆటోలో నుంచి జారిపడి ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన శనివారం బిఆర్‌టిఎస్ రోడ్డు ముడసర్లోవ సమీపంలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివి.

హనుమంతువాక నుంచి దారపాలెం వైపు వెళ్తున్న ఆటోలో ముగ్గురు ప్రయాణిస్తున్నారు. బిఆర్‌టిఎస్ రోడ్డు స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ దాటిన తరువాత రెండు గేదెలు పొట్లాడుకుంటూ డివైడర్‌ను దాటి ఆటో ప్రయాణిస్తున్న రహదారిలోకి ఒక్కసారిగా వచ్చాయి. దీనితో ఆటోడ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటోలో కూర్చున్న వృద్ధురాలు రోడ్డుపై పడిపోయింది. రోడ్డుకు గుద్దుకోవడంతో ముక్కు, చెవి నుంచి తీవ్రంగా రక్తస్రావమైంది. దగ్గర్లోని ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతి చెందిందని తెలిపారు.

నేటి నుంచి 'గ్లకోమా' వారోత్సవాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా ఈనెల 12 నుంచి 18వరకు జిల్లా వ్యాప్తంగా గ్లకోమావ్యాధి నివారణకు స్క్రీనింగ్ క్యాంపులు, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ పి. విశ్వమిత్ర తెలిపారు ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య కళాశాలలో, అర్బన్ హెల్త్ సెంటర్లు, సచివాలయాల్లో రేడియోలు, టీవీలు, ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. వారం రోజులపాటు స్క్రీనింగ్ క్యాంపులు, అవగాహన సదస్సులు చేపడతామన్నారు. అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, 45ఏళ్లు పైబడిన ప్రతిఒక్కరూ ఏటా సంపూర్ణ కంటి పరీక్షలు చేయించుకోవాలని, తద్వారా శాశ్వత అంధత్వం రాకుండా నివారించవచ్చన్నారు.జిల్లా అంధత్వనివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటివైద్యశిబిరాలను నిర్వహిస్తామని, ప్రజలంతా వాటిని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ విశ్వమిత్ర కోరారు.

అప్పన్నను దర్శించిన పలువురు ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నను శనివారం భీమిలి ఎమ్మెల్యే ముత్యంశెట్టి శ్రీనివాసరావు విజయవాడ ఎమ్మెల్యే మల్లాడి విష్ణు తదితరులు వేరువేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఎఇఒ ఆనంద్‌కుమార్ ఆలయ సాంప్రదాయం ప్రకారం సాదరస్వాగతం పలికారు ఆలయంలో గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు.స్వామి ప్రసాదం స్వీకరించారు.

నగర అభివృద్ధి, సుందరీకరణ పనులు

రెండు రోజుల్లో పూర్తిచేయాలి

క్షేత్రస్థాయి పరిశీలనలో జివిఎంసి కమిషనర్ రాజాబాబు

అధికారులకు సూచనలు చేస్తున్న జివిఎంసి కమిషనర్ రాజాబాబు

ప్రజాశక్తి- మధురవాడ : జి-20 సదస్సు నేపథ్యంలో నగరంలో చేపడుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి, మరో రెండు రోజుల్లోనే పూర్తిచేయాలని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సీతకొండ వ్యూపాయింట్, గుడ్లవానిపాలెం అమ్మవార్ల దేవాలయ సముదాయం, సాగరనగర్, ఇస్కాన్ టెంపుల్ జంక్షన్, రాడిసన్ బ్లూ హోటల్ తదితర సాగర తీర ప్రాంత వ్యూపాయింట్ల వద్ద చేపడుతున్న పనులను పరిశీలించారు. గుడ్లవానిపాలెం అమ్మవార్ల దేవాలయ ప్రాంగణం వద్ద పనుల నాణ్యతను పరిశీలించి, ఆ ప్రాంగణం లో వాహనాల పార్కింగ్, పచ్చని మొక్కలు, సందర్శకులు కూర్చునేందుకు బెంచీలు, విద్యుత్ దీపాలు, ఓపెన్ జిమ్, పిల్లల ఆట పరికరాలు ప్రణాళిక ప్రకారం ఉండాలని ఎస్ఇ శాంసన్ రాజును, డిడి(హార్టికల్చర్) ఎం. దామోదరరావును ఆదేశించారు.

ఇక్కడే బీచ్ ప్రాంతంలో పిచ్చిమొక్కలను తొలగించి డస్ట్ బిన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. సందర్శనకు వచ్చేవారు వ్యర్థాలను బీచ్‌లో వేయకుండా పదిమంది గ్రీన్ అంబాసిడర్లతో నిరంతరం అవగాహన కల్పించాలన్నారు. టూరిస్ట్ బస్సుల పార్కింగ్ క్రమపద్ధతిలో ఉండేలా చర్యలు చేపట్టాలని, అతిక్రమించిన వారికి ఫైన్ విధించాలని జెడ్‌సి కనకమహాలక్ష్మిని ఆదేశించారు.

సాగర్ నగర్ బీచ్ పాయింట్ వద్ద పనులను పరిశీలించారు. అక్కడ మేజర్ డ్రైనేజీలోపూడికలు తొలగించి, చుట్టూ మొక్కలను అమర్చి అందంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రికల్ విద్యుత్ స్తంభాలకు అలంకరిస్తున్న ఎల్ఇడి రోప్ లైట్లను అందంగా అమర్చాలని నిర్వాహకులకు తెలిపారు. సీ వ్యూపాయింట్ల వద్ద సందర్శకులకు అసౌకర్యం కలగకుండా ఆహ్లాదం కలిగించే పచ్చదనాన్ని పెంపొందించడం, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ దీపాలంకరణ, పలుచోట్ల టైల్స్, ఫుట్‌పాత్‌లు, ఆకర్షణీయ పెయింటింగ్, ప్రాంతాలను తెలిపే సూచిక బోర్డులు, రోడ్లపై జీబ్రా క్రాసింగ్ లైన్స్‌తోపాటు, వ్యాపారులు ఒక క్రమ పద్ధతిలో వ్యాపారం చేసుకునేందుకు వారికి నిర్దేశించిన పాయింట్లు కల్పించడం, వాహనాల పార్కింగ్ తదితర పనులు మరో రెండు రోజుల్లో పూర్తిచేయాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు.

పనుల నిర్వహణలో ఆలసత్వం ప్రదర్శించరాదని, నాణ్యతతో పనులు చేపట్టాలన్నారు. పర్యటనలో పర్యవేక్షక ఇంజినీర్లు శాంసన్‌రాజు, వినయ్‌కుమార్, ఇఇ మత్స్యరాజు, డిఇఇ లక్ష్మోజీ, ఎఎంఒహెచ్ డాక్టర్ ఎన్ కిషోర్ పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల్లో తప్పులు సరిచేయండి

వినతిపత్రం అందజేస్తున్న వెంకటరావు

ప్రజాశక్తి -గోపాలపట్నం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లకు అధికారికంగా పంపిణీ చేసిన ఓటరు స్లిప్పుల్లో పోలింగ్ కేంద్రాలు, ఇతర సమాచారంలో అనేక పొరపాట్లు ఉన్నాయని, వాటని సరిదిద్ది మళ్లీ ఓటర్లకు అందజేయాలని సిఐటియు గోపాలపట్నం జోన్ అధ్యక్షుడు బలివాడ వెంకటరావు కోరారు. ఈ మేరకు శనివారం అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారి కె.జయరాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.. ఎన్‌ఎడి కొత్త రోడ్డు నుంచి విమాననగర్, ఎస్‌సి,బిసి కాలనీ వరకు ఓటర్లకు అందజేసిన స్లిప్పుల్లో పోలింగ్ కేంద్రం పేరు గోపాలపట్నం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు బదులుగా ఎస్ఇ రైల్వే మర్రిపాలెం అని కొన్ని స్లిప్పుల్లో పేర్కొన్నారన్నారు. పోలింగ్ కేంద్రానికి సంబంధించిన సమాచారం తప్పుడుగా నమోదైతే ఓటర్లు అయోమయానికి గురయ్యే అవకాశం ఉందని, దీనిపై పరిశీలన జరిపి, పూర్తి సమాచారంతో సరైన ఓటరు స్లిప్పులను అందజేయాలని కోరారు.

అంధ విద్యార్థులకు చేయూత

సాయాన్ని అందజేస్తున్న కెనరాబ్యాంకు యూనియన్ సభ్యులు

ప్రజాశక్తి- పెందుర్తి : 95వ వార్డు ఎంవిపి లేఅవుట్‌లోని అంధ పాఠశాల విద్యార్థులకు విశాఖపట్నం కెనరాబ్యాంక్ యూనియన్ సంఘ సభ్యులు గృహావసర వస్తువులను శనివారం వితరణగా అందజేశారు ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి యువిఎన్ఎస్ హరివర్మ మాట్లాడుతూ ఏటా మహిళా దినోత్సవం రోజున ఇటువంటి సేవా కార్యక్రమాలను అనవాయితీగా కొనసాగిస్తున్నామన్నారు. అంధ పాఠశాల విద్యార్థులకు సరిపడే నిత్యావసరాలతోపాటు మందులు, కుర్చీలు, దుస్తులు, పబ్లిక్ అకౌంట్ సిస్టమ్‌ను అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి విద్యార్థులకు చేతనైన సాయాన్ని అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, అవకాశం ఉన్న ప్రతిఒక్కరూ ఇలాంటి విద్యార్థులకు చేదోడుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్యవర్గసభ్యులు ప్రసన్నలక్ష్మి మహేంద్ర, శ్రీనివాసరావు, కృష్ణ కిషోర్ రెడ్డి, ఉషాకిరణ్, ప్రిన్సిపల్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు

సుబ్బారెడ్డిని కలిసిన వెంకటేష్

సుబ్బారెడ్డిని అభినందిస్తున్న వెంకటేష్

ప్రజాశక్తి- సీతమ్మధార : వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, టిడిపి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డిని 25వ వార్డు వైసిపి నేత సమ్మెట్ల వెంకటేష్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సుబ్బారెడ్డి సూచించారని వెంకటేష్ తెలిపారు.

వేదాంత ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ రాధికకు

'ఐకాన్ ఆఫ్ ద ఇయర్' అవార్డు

అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ రాధిక

ప్రజాశక్తి -పిఎం పాలెం: పిఎం పాలెం వేదాంత హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ రాధికకు రేడియోసిటీ ఐకాన్ ఆఫ్ ఇయర్ 2022-23 అవార్డు లభించింది. రేడియోసిటీ నగరం లో ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వ హిస్తున్న అవార్డుల పంపిణీలో భాగంగా ఈ ఏడాది ఒబెస్టిక్ అండ్ గైనకాలజీ విభాగంలో ఉత్తమమైన సేవలు అందించిన వేదాంత ఆసుపత్రి ప్రసూతి వైద్యురాలు డాక్టర్ రాధికకు ఈ అవార్డు లభించింది. నగరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం లో జివిఎంసి ప్రధాన కమిషనర్ రాజాబాబు నుంచి డాక్టర్ రాధిక అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్తమ సేవల అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.. పిఎం పాలెం, మధురవాడతోపాటు ఇతర ప్రాంతాల రోగులకు వేదాంత ఆసుపత్రిలో ఉత్తమమైన సేవలు అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా మధురవాడ పరిసరప్రాంతాలలో ఎక్కడా లేనివిధంగా అడ్వాన్స్‌డ్ లాప్రోస్కోపిక్ సర్జరీలు వేదాంత ఆసుపత్రిలోనే చేస్తున్నామని, ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఒత్తిడి, నొప్పి లేని నార్మల్ డెలివరీలు, హైరిస్క్ గర్భిణుల కాన్పులను తమ ఆసుపత్రిలో విజయ వంతంగా నిర్వహిస్తున్నా మని, 24/7 ప్రజలకు ఉత్తమమైన వైద్యసేవలు అందించేందుకు వేదాంద ఆసుపత్రి సిద్ధంగా ఉందన్నారు. అవార్డు గ్రహీత డాక్టర్ రాధికను వేదాంత ఆసుపత్రి ఎండి డాక్టర్ శివ, పీడియాట్రీషియన్ డాక్టర్ ప్రకాశ్ అభినందించారు.

ఘనంగా ఎన్ఎస్ఆర్ఐటి వార్షికోత్సవం

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డైరెక్టర్, ఛైర్మన్

ప్రజాశక్తి -ఆనందపురం :మండలంలోని శొంఠ్యాం నడింపల్లి సత్యంరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఎస్ఆర్ఐటి)లో వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. జెఎన్‌టియు విసి ఆచార్య వెంకట సుబ్బయ్య ముఖ్య అతిథిగా పాల్గొని వార్షికోత్సవాలను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంజనీరింగ్ విద్యార్థి కలలు కనాలని, ఆ కలలు సంకల్పం కావాలని, సంకల్పం రూపకల్పన జరగాలని పిలుపునిచ్చారు. కళాశాల డైరెక్టర్ మురుగుదాస్ కాలేజీకి చెందిన విద్యార్థులు వివిధ ఐఐటిలు, ఇంజనీరింగ్ కళాశాలలో సాధించిన విజయాలను వివరించారు. మెరిట్ విద్యార్థులకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. ఛైర్మన్ సత్యనారాయణరాజు,సెక్రటరీ ప్రసాద్ రాజు, ట్రెజరర్ కనకరాజు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శిక్షణార్థులకు సర్టిఫికెట్లు అందజేత

సర్టిఫికెట్లతో శిక్షణ పొందిన గిరిజనులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఆధ్వర్యంలో అల్లూరి జిల్లాలో వివిధ స్వయంఉపాధి, వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందిన 540 మందికి శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. టైలరింగ్, కటింగ్, డ్రెస్‌మేకింగ్‌లో సుమారు 200 మందికి, విస్తరాకుల తయారీలో 260 మందికి, ఇంటికి అవసరమైన రసాయనాలు తయారీలో 80 మందికి శిక్షణనిచ్చారు. అల్లూరి జిల్లాలో నమ్మిడివలస, వలసి, బల్లిమామిడి, మాలివలస, చంపి, పాకనకుడి మలిసింగారం, కొడిమ్మా, శివలింగపురం, గడ్డంపుట్టు తుంపాడ, రాములపుట్టు, వర్దన పల్లి, కడలి గిరిజన గ్రామాలకు చెందిన వీరికి రూ.19.98 లక్షల వెచ్చించి జన శిక్షణ సంస్థాన్ ద్వారా శిక్షణను అందించినట్లు డీజీఎం రమణారావు తెలిపారు. గత ఏడాది డిసెంబర్ నెలలో ప్రారంభమైన శిక్షణ కార్యక్రమాలు, ఫిబ్రవరిలో ముగియగా, శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

నర్సింగ్ వృత్తితో ఆత్మ సంతృప్తి

గీతం నర్సింగ్ విద్యార్థులతో యుకె నిపుణురాలు అనురాధ

ప్రజాశక్తి -మధురవాడ: వైద్యరంగంలో నర్సింగ్ వృత్తికి ప్రపంచవ్యాప్తంగా అధిక డిమాండ్ ఉందని, ఆపద సమయంలో మనిషి ప్రాణాలను కాపాడుతున్నామన్న ఆత్మ సంతృప్తి లభిస్తుందని యుకె లోని లండన్ రాయల్ బ్రాంప్టన్ వైద్యాలయం నిపుణురాలు అనురాధ భూపతిరాజు అన్నారు. శనివారం గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో నర్సింగ్ వృత్తి అవకాశాలు అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌ను ప్రారంభించి మాట్లాడారు. నర్సింగ్ వృత్తిలో రాణించాలంటే అంకితభావం, రోగుల పట్ల శ్రద్ధ, సేవా నిరతి, చక్కటి భావప్రకటన సామర్థ్యం అవసరమని సూచించారు. దేశ, విదేశాలలో నర్సింగ్ వృత్తికి గల అవకాశాలను వివరించారు. గీతం కాంపిటెన్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ రోజీనామ్మాథ్యూ మాట్లాడుతూ నిరంతర అధ్యయనంతో పాటు నర్సింగ్ వృత్తిలో నైపుణ్యాల పెంచుకోవడానికి నెట్‌వర్కింగ్ అవసరమన్నారు. గీతం నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.లక్ష్మమ్మ, డాక్టర్ బి. స్పందన పాల్గొన్నారు.

వంట సామగ్రి వితరణ

వంట సామగ్రి అందజేస్తున్న దాతలు

ప్రజాశక్తి -మధురవాడ : రుషికొండలోని మహాలక్ష్మి గోదాదేవి సహిత వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ప్రవీణ్ రామారావు రూ.1.25 లక్షల విలువ చేసే రిఫ్రిజిరేటర్, గ్రైండర్, 41 రకాల వంటపాత్రలను ఆలయ అధికారులకు శనివారం అందజేశారు.కార్యక్రమంలో భ్రమరాంబిక సేవాసమితి కోఆర్డినేటర్ పి.విజయ, పివిఎస్.రావు పాల్గొన్నారు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించండి

సిపిఎం విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల కార్యదర్శులు జగ్గునాకయుడు, లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల కార్యదర్శులు ఎం.జగ్గు నాయుడు, కె.లోకనాథం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన అధికార పార్టీ నాయకులపై చర్యలు తీసుకోకపోవడం ఎన్నికల నిర్వహణపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల నాటి నుంచి ఎన్నికల ఉల్లంఘనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుండా రక్షించే ప్రయత్నం చేయడం విచారకరమన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ ఉప కులపతి ప్రసాద్‌రెడ్డిని కాపాడిన తీరు, ఓటర్లకు వెండి నాణేలు పంపిణీ చేసేందుకు తన క్యాంప్ ఆఫీసులో ప్యాకింగ్ చేస్తున్న వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌పై చర్య తీసుకోకుండా కరపత్రాలు ఉన్నట్టు దర్యాప్తులో తేలినట్టు అధికారులు చెప్పిన తీరును బట్టి అధికార పార్టీ అక్రమాలకు అధికారులు సమర్థిస్తున్నట్టు స్పష్టం అవుతుందని పేర్కొన్నారు. అనర్హులు ఓటు వేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అక్రమాలకు పాల్పడిన, ఓటర్లను ప్రలోభపరిచిన వారిపై కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న సిఐ రవికుమార్

భద్రతపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి- కశింకోట : కంపెనీల్లో ప్రమాదాలపై జాగ్రత్తలు తీసుకోవాలని అనకాపల్లి సిఐ ఎ రవికుమార్ అన్నారు. మండలంలోని ఏయస్ పేటలో చెట్టినాడ్ సిమెంట్ కంపెనీ ఆవరణలో శనివారం 52వ జాతీయ రహదారి వారోత్సవాలు సందర్భంగా అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ రోడ్ సేఫ్టీ సంబంధించిన, ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేస్తున్నట్లు చెప్పారు. యస్ఐ ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలన్నారు. ఈ అవగాహన సదస్సులో చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ ఏజీఎం నరసింహ రాజు, సిబ్బంది ధనుంజయ్, చక్రపాణి, మేనేజర్ దిల్లీశ్వరి పోలీస్ సిబ్బంది కంపెనీ కార్మికులు పాల్గొన్నారు.

13న కాలం చెల్లిన వాహనాలకు వేలం

ప్రజాశక్తి-అనకాపల్లి :జిల్లా పోలీసు విభాగంలో కాలం చెల్లిన 89 వాహనాలను ఈనెల 13న ఆన్లైన్ ద్వారా బహిరంగ వేలం వేసున్నట్టు ఎస్పీ గౌతమి సాలి తెలిపారు. హెచ్‌విఎం, ఎంఎంవి వాహనాలు 8, వాహనాలు 53, ఎంసీ వాహనాలు రెండు కలిపి 15 లాట్లుగా విభజించి వేలం వేయడం జరుగుతుందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఆసక్తి ఉన్నవారు https://www.konugolu.ap.gov.in వెబ్ సైట్‌లో బిడ్డింగ్ వేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9440796073, 9885230459 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

చీఫ్ సూపరింటెండెంట్ వర్మ

ప్రజాశక్తి- దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 15 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని, వీటికి ఏర్పాట్లు పూర్తి చేశామని చీఫ్ సూపరింటెండెంట్, స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ యువిఎన్ వర్మ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ పరీక్షలకు మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 201 మంది, ఒకేషనల్ 77 మంది కలిపి 278 మంది, రెండవ సంవత్సరం జనరల్ విద్యార్థులు 276 మంది, ఒకేషనల్ 67 మంది కలిపి 303 మంది హాజరవుతున్నట్లు చెప్పారు. ప్రైవేట్‌గా జనరల్ 14 మంది, ఒకేషనల్ ఇద్దరూ కలిపి 16 మంది రాస్తున్నట్లు తెలిపారు. 15 రూములలో సీసీ కెమెరాల మధ్య పరీక్షలు జరుగుతాయన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలు 15వ తేదీ నుండి, రెండవ సంవత్సరం పరీక్షలు 16వ తేదీ నుండి ప్రారంభమవుతాయని, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు పరీక్షా సమయానికి 30 నిమిషాల ముందుగా హాజరు కావాలన్నారు. పరీక్ష తేదీలలో 144 సెక్షన్ అమల్లో ఉందని చెప్పారు. ఈ పరీక్ష సెంటర్లో దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు తెనుగుపూడి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, బీతపూడి కస్తూరిబా గురుకుల కళాశాల, దేవరాపల్లి శారదా కళాశాల, ఆనందపురం ఒకేషనల్ కళాశాల విద్యార్థులు పరీక్షలు రాస్తారని తెలిపారు.

మాట్లాడుతున్న చీఫ్ సూపరింటెండెంట్ వర్మ

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో 2023-24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. విజయకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఈ నెల 24వ తేదీలోగా దగ్గరలో ఉన్న బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లేదంటే http:apgpcet.apcfss.in ద్వారా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సహజీవనం భారత దేశ సంస్కృతి కాదు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

ప్రజాశక్తి-సబ్బవరం

సహ జీవనం అనేది భారతదేశ సంస్కృతి కాదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. మండలంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఉమెన్ అండ్ చైల్డ్ లా వారి నిర్వహణలో 'సహ జీవనం – వివాహం, వివాహ చట్టాలపై ప్రభావం" అనే అంశంపై నేషనల్ సెమినార్‌ను శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసి మానవేంద్రనాథ్‌రాయ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహానికి పూర్వమే కలిసి జీవించి ఒకరిని ఒకరు అర్థం చేసుకుంటారని అనే వాదనలో నిజం లేదని తెలిపారు. స్త్రీ స్వేచ్ఛ, ఆర్థికాభివృద్ధి అనే పేరుతో యువత పక్క దారి పడుతోందన్నారు. మన దేశంలో పూర్వం ఇలాంటి సంబంధాలు లేవని, వీటి రక్షణ కోసం పటిష్టమైన చట్టాలు అమలు చేయాలని కోరారు. సెక్షన్ 497 ఐపిసి ముఖ్య ఉద్దేశం, మనుస్మృతి, గృహ హింస చట్టం, 2005లో సహ జీవనం గురించి పొందుపరిచిన అంశాల వివరించారు. భరణం, ఆస్తి హక్కు, వారసత్వం అనే చాలా అంశాలు పరిశీలించవలసి ఉందని తెలిపారు. కళాశాల రిజిస్ట్రారు ప్రొఫెసర్ కె. మధుసూదనరావు మాట్లాడుతూ సహ జీవనం, వివాహ వ్యవస్థ అంశాల పట్ల, సమాజంలో జరుగుతున్న నేరాల పట్ల విద్యార్థులు మాత్రమే కాక ప్రతీ వ్యక్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్.సూర్య ప్రకాష్ మాట్లాడుతూ నేటి సమాజంలో చాలా మంది యువతీ యువకులు సహ జీవనం అనే కొత్త ఒరవడి వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. వివాహం అనేది మన భారత దేశ సంప్రదాయమని పేర్కొన్నారు. వివాహ బంధం లేకుండా కలిసి జీవించాలని అనుకునే జంటలు చాలా విషయాలు ఆలోచించాలని, సమస్యలు, భద్రత, భవిష్యత్తు, ఆచార సంప్రదాయాలు, హక్కులు గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వివాహ చట్టాలలో ప్రత్యేకంగా ఏ హక్కులు కల్పించబడలేదని, ఇటువంటి సహ జీవనం చేసే వారికి చట్టం అమలు లేదని పేర్కొన్నారు. అయినప్పటికీ హైకోర్టు, సుప్రీం కోర్టు వారు దేశంలో చట్టం లేని కారణంగా హింసలకు, ఇబ్బందులకు అమ్మాయిలు గురి కాకూడదనే ఉద్దేశంతో బాధితుల రక్షణ కొరకు గైడ్ లైన్స్ ఇస్తున్నారని తెలిపారు. వివాహం, కుటుంబం అనేవి సమాజానికి మూల స్థంబాలని, వాటిని కాపాడవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ ఉమెన్ అండ్ చైల్డ్ లా కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.విజయలక్ష్మి, ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ దయానంద్ మూర్తి, ప్రొఫెసర్ అరుణ శ్రీ, సెమినార్ కో కన్వీనర్ డాక్టర్ భాగ్య లక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జస్టిస్ మానవేంద్రనాథ్‌ను సత్కరిస్తున్న లా వర్సిటీ వీసీ

మహిళలతో కలిసి బస్సులో ప్రయాణిస్తున్న దొరస్వామి

మహిళా ఉద్యోగులకు రక్షణే లక్ష్యం

బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొరస్వామి

ప్రజాశక్తి అచ్యుతాపురం

బ్రాండిక్స్ ఇండియా అపరిల్ సిటీ పరిశ్రమలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించడమే బ్రాండిక్స్ ప్రధానమైన లక్ష్యంగా భావిస్తున్నట్లు బ్రాండిక్స్ ఇండియా పాట్నర్ దొరస్వామి తెలిపారు. బ్రాండిక్స్ నుంచి ఉద్యోగి సొంత గ్రామాలకు వెళ్లే బస్సులలో శుక్రవారం రాత్రి ఆయన మహిళా ఉద్యోగులతో కలిసి ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు బస్సులలో ప్రయాణం చేసేటప్పుడు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏం చేయాలని మహిళలను అడిగారు. మహిళలు చేసిన సూచనలు పాటిస్తామన్నారు. డ్రైవర్ల ప్రవర్తన, బస్సులో వేగం తదితర వాటిపై సూచనలు చేశారు. తమతో పాటు దొరస్వామి ప్రయాణం చేయడానికి మహిళా ఉద్యోగులు ఆనందంతో గడిపారు.

12 నుంచి గ్లకోమా వారోత్సవాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రపంచ గ్లకోమా వారోత్సవాల సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 18 వరకు గ్లకోమా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు డాక్టర్ జివి రమణ కుమార్ తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా గ్లకోమియా వ్యాధి నివారణ కేంద్రాలు, ఆసుపత్రుల్లో ప్రత్యేక నేత్ర పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. 45 సంవత్సరాల పైబడిన వారు మధుమేహం, రక్త పోటు, వయోవృద్ధులు తప్పనిసరిగా ప్రతి సంవత్సరం సంపూర్ణ నేత్ర పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. దీనివలన శాశ్వత అంధత్వం రాకుండా కాపాడుకోవచ్చున్నారు. జిల్లాలో ఉన్న పారామెడికల్ ఆప్తాల్మిక్ వైద్యులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, కంటి ఆసుపత్రుల వారిచే అవగాహన సదస్సులు, అంధత్వ నివారణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

'డాక్టర్ కెకెఆర్ గౌతమ్'లో ఉత్సాహంగా స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి- విశాఖపట్నం

కూర్మన్నపాలెంలోని డాక్టర్ కెకెఆర్.గౌతమ్ స్కూల్‌లో శనివారం స్పోర్ట్స్ మీట్ ఘనంగా నిర్వహించారు. ఈ స్పోర్ట్స్ మీట్‌ను స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్‌కె.రేఖ ప్రారంభించారు. బాల బాలికలకు ఖోఖో, క్యారమ్స్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్, ప్రత్యేకంగా బాలికలకు త్రోబాల్, స్కిప్పింగ్, టెన్నికాయిట్, బాలురకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు ఈ పోటీల్లో అత్యంత ఉత్సాహంగా పాల్గొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు. పాఠశాల పిఇటి రామకృష్ణ, ఉపాధ్యాయులు తమ్మునాయుడు, రాజేంద్రపాడి, సూర్యనారాయణ, వెంకునాయుడు, అనంతరావు, సురేష్, వెంకటరావు, రామ్మోహన్‌రావు, సదాశివలక్ష్మి తదితరులు ఈ పోటీలకు అంపైర్‌లుగా, న్యాయనిర్ణేతులుగా వ్యవహరించారు.

క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థినులు

ఆక్రమణలపై ఆందోళన

- పెదపల్లిలో 3.27 ఎకరాల చెరువు భూమి కబ్జా
- అధికారుల అండదండలపైనా అనుమానం
- ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామ యువకుల నిరసన

ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలుపుతున్న యువకులు

ప్రజాశక్తి - యలమంచిలి

ప్రభుత్వ భూమి ఖాళీగా కనిపించిందంటే చాలు రాత్రికి రాత్రే కబ్జా రాయుళ్ల దురాక్రమణకు పాల్పడుతున్నారు. ఈ సంగతి ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిమ్మకు నీరెత్తినెట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. అలాంటి వారికి మండలంలోని ఎర్రవరం రెవెన్యూ పరిధి పెదపల్లిలో యువకులు ఎదురు తిరిగారు. గ్రామానికి చెందిన సుమారు పాతిక మంది యువకులు కబ్జాకు గురైన చెరువు భూమిని స్వాధీనం చేసుకోవాలంటూ ఆందోళనకు దిగారు. అక్రమార్కులకు ఎదురు తిరిగి చెరువు భూములు ఖాళీ చేయాలంటూ నినాదాలు చేశారు.

పెదపల్లి సర్వే నెంబరు 286లో 12.49 ఎకరాల చెరువు అన్యాక్రాంతమవుతోంది. ఇందులో 3.27 ఎకరాల భూమిని ఓ భూస్వామి 286-2బి సబ్ డివిజన్ చేసి ఆక్రమించి అనుభవిస్తున్నాడని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన యువకులు అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేశారు. అయినా ఆ భూమిని స్వాధీనం చేసుకోకపోవడంతో శనివారం ఆ యువకులంతా ఆక్రమణకు గురైన భూమిలో నిరసనకు దిగారు. చెరువును ఆక్రమించే అధికారం ఎవరికీ లేదని, తక్షణమే కబ్జాదారుడిని ఖాళీ చేయించాలంటూ పలకలపై నినాదాలు రాసి ప్రదర్శించారు. కోట్ల రూపాయలు విలువ చేసే భూమిని తప్పుడు సర్వే నెంబర్లతో ఆక్రమించి అనుభవించడాన్ని వారు ఖండించారు.

ఈ కబ్జాపై నెల రోజుల క్రితం రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు ఎటువంటి చర్యలు చేపట్టక పోవడంతో అధికారుల అండదండలపైనా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ పెట్టిన బోర్డులను కబ్జాదారులు ధ్వంసం చేసినా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కబ్జాదారుడిని వెంటనే చెరువు నుండి తరిమి కొట్టాలని యువకులు ఆవేశంగా నినదించారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి నెలలు గడుస్తున్నా చెరువు బౌండరీ నిర్ణయించడం పట్ల అలసత్వం వహిస్తున్నారని యువకులు మండి పడ్డారు. అధికారులు చర్యలు చేపట్టకుంటే తమ భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువ నాయకులు పడాల నాగేశ్వరరావు, మరిశా శ్రీను, చేబ్రోలు గోవింద్, నరమాల రాము, నక్కా శివ, బొద్దపు అప్పల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులతో సెయింట్ జాన్స్ విద్యార్థులు

వృద్ధులకు సెయింట్ జాన్స్ విద్యార్థుల చేయూత

ప్రజాశక్తి - కశింకోట

స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్ విద్యార్థులు వృద్ధులకు చేయూతను అందించారు. ఇటీవల సెయింట్ నాన్స్ స్కూల్లో జరిగిన సైన్స్ దినోత్సవం సందర్భంగా సేవా దృక్పథం నిమిత్తం విద్యార్థులు నిర్వహించిన నైపుణ్య ప్రదర్శన, ఫుడ్ కోర్టు ద్వారా సేకరించిన రుసుముతో శనివారం విశాఖపట్నంలో ఉన్న సెయింట్ జోసెఫ్ వృద్ధాశ్రమానికి 50 ఫ్లాస్కులు, కిరాణా సామాన్లు, ఇతర వస్తువులను అందించారు. తర్వాత వృద్ధుల జీవిత అనుభవాలను తెలుసుకొని, పదవ తరగతి విద్యార్థులు తమ ఆటపాటలతో వారిని అలరించి, నూతన ఉత్సాహాన్ని నింపి వారి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబుల్ కుమార్ విద్యార్థుల సేవా నిరతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ బత్తుల అనురాధ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీమంతం చేస్తున్న దృశ్యం

గర్భిణులకు సీమంతం

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం పంచాయితీ ఏడవ వార్డు అంగన్వాడీ కేంద్రంలో శనివారం పిల్లలకు అన్నప్రాసాన, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఓరుగంటి నాగమణి, అంగన్వాడి కార్యకర్త గోవాడ వరలక్ష్మి, ఆయా ఓరుగంటి లోవ, ఆశా వర్కర్ రాయపు రెడ్డి సంతోషి, కర్రీ లక్ష్మి, పార్వతి, అమ్మాజీ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతి జీవితానికి పునాది లాంటిది

ప్రజాశక్తి-అనకాపల్లి

10వ తరగతి విద్యార్థుల జీవితాలకు పునాది లాంటిదని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు విద్యార్థుల సమావేశంలో మాట్లాడారు. విద్య మనిషికి ప్రాణవాయువు లాంటిదని, పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు తమ సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. ఉపాధ్యాయులు మోతీబాయి, మహేంద్ర నాథ్ పట్నాయక్ మాట్లాడుతూ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పాఠశాలలో మోడల్ పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. తల్లిదండ్రుల మనోభావాలను గుర్తించి విద్యార్థులు అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధనుంజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

జిల్లాలో 49 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
- కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి- అనకాపల్లి

ఈనెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల వివరాలను కలెక్టర్ రవి పఠాన్ శెట్టి శనివారం వెల్లడించారు. జిల్లాలో 42,714 మంది ఓటర్లు ఉన్నారని, ఇందుకుగాను 44 ప్రాంతాల్లో 49 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కావలసిన సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారం ఈనెల 11 సాయంత్రం నాలుగు గంటలకు ముగిసినందున 13వ తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకు ఎన్నికల ఆంక్షలు విధించినట్టు తెలిపారు. ప్రజలను ఆకర్షించే విధంగా బహిరంగ సమావేశాలు నిర్వహించినా, పాల్గొన్నా, ఊరేగింపు జరిపినా, మీడియా ప్రచార సాధనాల ద్వారా ప్రదర్శనలు నిర్వహించడం ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించడమే అన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా రెండు విధించడం జరుగుతుందన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిశీలన

కె.కోటపాడు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ చిన్నికృష్ణ

ప్రజాశక్తి-కె.కోటపాడు

ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఒక్కో పోలింగ్ కేంద్రంలో 800 వరకు ఓట్లు ఉన్నాయని తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం 144 సెక్షన్ అమలు చేసినట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రచార సమయం ముగిసినందున పట్టభద్రులకు ఎటువంటి మెసేజ్‌లు పెట్టినా ఆయా అభ్యర్థులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆయన వెంట తహశీల్దారు రమేష్ బాబు , ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ త్రిమూర్తులు ఉన్నారు.

సబ్బవరం : ఎమ్మెల్సీ ఎన్నికలకు పగడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు స్థానిక సిఐ పి.రంగనాథం తెలిపారు. ఈ మేరకు పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్బవరంలో ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ ఎన్నికల బందోబస్తు విధుల్లో 42 మంది పోలీస్ సిబ్బంది పాల్గొంటారన్నారు. వీరిలో ఒక సీఐ, ఇద్దరు ఎస్సైలు,10 మంది హెచ్సీలు, 29 మంది పిసిలు ఉన్నారన్నారు. పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన వారిలో ఎస్సై ఎల్ సురేష్, ఎఎస్సై అల్లు వెంకటేశ్వరరావు ఉన్నారు.

అచ్చుతాపురం : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని శనివారం జోనల్ ఆఫీసర్ టి.ప్రభాకర్ రావు, రూట్ ఆఫీసర్ బి ఎర్రపాత్రుడు పరిశీలించారు. అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 197, 198 నెంబర్లతో పోలింగ్ బూత్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రాల్లో ఓటింగ్ వేయడానికి అనుకూలంగా సదుపాయాలు విద్యుత్తు తదితర సదుపాయాలపై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వై శ్రీనివాసరావు, ఎంపీడీవో విజయలక్ష్మి ,విఆర్ఓ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నూకాంబిక ఆలయంలో పూజలు చేస్తున్న పీలా దంపతులు

మాజీ ఎమ్మెల్యే పీలా వివాహ దినోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ విజయలక్ష్మి దంపతుల వివాహ దినోత్సవం స్థానిక నూకాంబిక అమ్మవారి దేవాలయంలో శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సురేంద్ర, జోగి నాయుడు, పోలవరపు త్రినాథ్, సబ్బవరం గణేష్, శంకర్ల పద్మలత, అక్కిరెడ్డి రమణబాబు, పచ్చి కూర రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు వైసిపి 12వ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని కలిగొట్ల గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం నిర్వహించడానికి ఏర్పాట్లు చేసామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జడ్పీటీసీ కర్రి సత్యం విచ్చేసి జెండా ఎగరవేస్తారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

133వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద ఎన్ఎఒబి గేట్ వద్ద నేవీ నిర్వాసితులు చేపట్టిన ఆందోళన శనివారం నాటికి 133వ రోజుకు చేరింది. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఈ ఉద్యమాన్ని ఆపేది లేదని, అవసరమైతే ఎన్ని రోజులైనా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

గుండెపోటుతో కళాకారుడు మృతి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో కళాకారుడు సరగడం శివ వెంకట అప్పారావు గుండెపోటుతో మృతి చెందారు. పొలంలో పని చేస్తుండగా ఒకసారిగా ఆయన నిస్సహాయతతో కుప్పకూలిపోయాడు. శివ పలు సాంస్కృతిగా సాంఘిక నాటిక నాటకాలలో ప్రదర్శనలు చేశాడు. ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో నేలవేషాలు వేశాడు. ఇతనికి తల్లి, భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

మండల విద్యాశాఖాధికారి ప్రసాద్

ప్రజాశక్తి- నక్కపల్లి:టెన్త్ పరీక్షలు పూర్తయ్యే వరకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ డివిడి ప్రసాద్ సూచించారు. జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు శనివారం స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో పదిలో శాతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చి దిద్దుతున్నట్లు తెలిపారు.ఇప్పటికే పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలనే తపనతో ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికలను అమలు చేసి శతశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నారన్నారు. మెరిట్ విద్యార్థులతో పాటు చదువులో వెనుకబడిన విద్యార్థుల పై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పది మంది విద్యార్థులను ఒక ఉపాధ్యాయుడు దత్తత తీసుకుని ప్రత్యేక తరగతులు నిర్వహించి సబ్జెక్టుల వారిగా బోధన చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించడం జరిగిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సూచనల మేరకు తమ పిల్లలను ఇంటి వద్ద ప్రణాళిక బద్ధంగా చదివేలా చూడాలన్నారు.విద్యార్థులు కష్టపడి చదివితే తప్పనిసరిగా మెరుగైన ఫలితాలు సాధిస్తారన్నారు. పరీక్షలు ముగిసే వరకూ ఇళ్ళ వద్ద టీవీలకు, సెల్ ఫోన్‌లకు పిల్లలను దూరంగా ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ కర్రి పద్మ, వైస్ చైర్మన్ లోవ కన్నబాబు, ఉపాధ్యాయులు ఎస్.వి.ఎస్.ఆచార్యులు, టి.వి.రమణ, ఎస్.అప్పారావు, సత్యవతి, బాబూజీ, పాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ ప్రసాద్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపిని ఓడించాలి

-రెండవ ప్రాధాన్యత ఓటును పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు వేయండి

-మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-గొలుగొండ:ఈనెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపిని ఓడించాలని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ పొలిట్ బ్యూరో సభ్యులు అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన శనివారం గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్‌పురం గ్రామానికి విచ్చేశారు. స్థానిక నాయకులు చింతల నారాయణమూర్తి ఇంటి వద్ద సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. మొదటి ప్రాధాన్యత ఓటును టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావుకు, రెండో ప్రాధాన్యత ఓటును పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు వేయాలని పార్టీ అధిష్ఠానం తీర్మానించిందని తెలిపారు. మరో ఆరు నెలల్లో శాసనసభ ఎన్నికలు ఖచ్చితంగా వస్తాయని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమితో వైసిపి ప్రభుత్వ పతకానికి నాంది పలకాలన్నారు. ఓటు వేసే విధానాన్ని ఆయన ఓటర్లకు క్షుణ్ణంగా వివరించారు. వైసిపి, బిజెపి అభ్యర్థులకు ఓటు హక్కు అడిగే నైతిక హక్కు లేదని ఆయన విమర్శించారు. ఉత్తరాంధ్ర దోపిడికి గురవుతుంటే కనీసం ప్రభుత్వంతో మాట్లాడలేని ఎమ్మెల్యేలు, మంత్రులు ఏముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని ఆయన దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నేపథ్యంలో వైసిపి దొంగ ఓట్ల విషయంపై ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, మాజీ జెడ్పీటీసీ తారక వేణుగోపాల్, చోద్యం సర్పంచ్ అదపురెడ్డి గోపాలకృష్ణ, పార్టీ నాయకులు సాంబమూర్తి, టిఎన్‌ఎస్‌ఎఫ్ పార్లమెంటరీ ఉపాధ్యక్షులు శ్రీకాంత్, లింగంపేట మాజీ సర్పంచ్ పరవాడ అప్పలనాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

క్యూ లైన్ లో నిలుచున్న భక్తులు

ఉపమాకలో భక్తుల రద్దీ

ప్రజాశక్తి -నక్కపల్లి:ఉపమాక వెంకన్న క్షేత్రం శనివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. సుదూర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తుల తరలి వచ్చి కొండపైన, దిగువున ఉపాలయాల్లో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమా చార్యులు, శేషాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకిటలాడింది.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

రాష్ట్రంలో అరాచక పాలన

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: రాష్ట్రంలో జరుగుతున్న వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర పిలుపునిచ్చారు. శనివారం నర్సీపట్నం ఎన్టీఆర్ హోంలో జనసేన పార్టీ 10వ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 14న మచిలీపట్నంలో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆవిర్భావ దినోత్సవ సభలో దిశా నిర్దేశం చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య, మున్సిపాలిటీ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, నాయకులు నమ్మి రమణరాజు, కర్రి సురేష్ పాల్గొన్నారు.

నూతన విద్యా విధానంపై అవగాహన

రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ డిఈఓ

ప్రజాశక్తి -కొత్తకోట:నూతన విద్యా విధానంలో ప్రవేశ పెడుతున్న విధానాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని యలమంచిలి డిప్యూటీ డిఈఓ ప్రేమ్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం ఆయన మండలంలో జెడ్.కొత్తపట్నం, రావికమతం బాలికల హైస్కూల్, గర్నికం కేజీబీవీ పాఠశాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో అమలవుతున్న లిప్ (లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం), పదవ తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతకు తీసుకోవలసిన చర్యలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. అంతకుముందు జెడ్ కొత్తపట్నం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం విద్యార్థులకు అందిస్తున్నదీ లేనిదీ తనిఖీ చేశారు. వంద రోజుల లిప్ ప్రోగ్రాం పై విద్యార్థులు ఇంతవరకు సాధించిన ప్రగతి, ఎనిమిదవ తరగతి విద్యార్థులకి ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబల ద్వారా బైజుస్ యాప్ లో పాఠాలపై సమీక్షించారు.

తారురోడ్డు.. మట్టి రోడ్డాయే..

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో నీలిగుంట సన్యాసిరాజుపాలెం రోడ్డు నాటి ఉమ్మడి ఆంధ్రలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన తారు రోడ్డు కాస్త ఇప్పుడు మట్టి రోడ్డు గా మారిపోయింది. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద భారత ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధి పనులు నిధులతో పంచాయతీరాజ్ శాఖ దాదాపు రెండు కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన రోడ్డు కాస్త ఇప్పుడు మట్టి రోడ్డు గా మారి పోవడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఈ రోడ్డుపై నుండి అక్రమ మట్టి రవాణా వివిధ వాహనాల్లో జరుగుతుండటంతో రోడ్డు దుస్థితి ఇలా తయారైందని ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. రాత్రి, పగలని తేడా లేకుండా నిరంతరం మట్టి లారీలు ఇతర ప్రాంతాలకు తరలించడంతో రోడ్డు పూర్తిగా శిథిలమైందని తెలిపారు. అధికార పార్టీ నాయకుల అండదండలతోనే అక్రమ మట్టి రవాణా జరుగుతుందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని నీలి గుంట, సన్యాసి రాజుపాలెం, కేబీ అగ్రహారం, పాములవాక బోదపాలెం ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మట్టి రోడ్డుపై వెళుతున్నవాహనదారుడు

టెన్త్‌లో పది మార్కులకే పాస్

విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం మినహాయింపు

ప్రజాశక్తి- కొత్తకోట: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రత్యేక అవసరాల విద్యార్థులకు వివిధ రకాల రాయితీలు, సదుపాయాలు, మినహాయింపులు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని మేడివాడ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయులు బి.మహాలక్ష్మినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, మేధో వైకల్యం, సెరిబ్రల్ పాల్సీ, ఆటిజం, కుష్టు వ్యాధి నయమగ్రస్తులు, మరుగుజ్జులు, మస్కులర్ డిస్ట్రోఫీ, యాసిడ్ దాడికి గురైన విద్యార్థులకు అన్ని సబ్జెక్టులలో కనీస మార్కులు 10 సాధిస్తే పాస్ అయినటట్లేనన్నారు. అంధులు, వినికిడి లోపం, అభ్యసన వైకల్యం పిల్లలకు 20 మార్కులు సాధిస్తే ఉత్తీర్ణత అవుతారని తెలిపారు. 21 రకాల వైకల్యాలలో వినికిడి లోపం వారికి తప్ప మిగిలిన 20 రకాల వైకల్యాలు కలిగిన విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సహాయకులను (స్క్రైబ్) నియామక అనుమతినిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వినికిడి లోపం గలవారికి రెండు భాషల నుంచి మినహాయింపు, అంధులకు, శారీరక వికలాంగులకు, అభ్యసనా వైకల్యం, బహుళ వైకల్యం తదితరులకు ఒక భాష నుంచి మినహాయింపు ఇచ్చారని తెలిపారు. దివ్యాంగ విద్యార్థుల అవసరాన్ని బట్టి వివిధ పరికరాలు, కుర్చీలు, కంటి అద్దాలు, క్యాలిక్యులేటర్లు, శ్రావణ యంత్రాలు, కృత్రిమ అవయవాలు, కేర్ టేకర్స్ సేవలను ఉపయోగించుకోవచ్చునని సూచించారు.

మహాలక్ష్మినాయుడు

మాట్లాడుతున్నఅప్పారావు

లక్ష్యంతో చదివితే బంగారు భవిష్యత్

ప్రజాశక్తి-కోటవురట్ల: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని మండల విద్యాశాఖ అధికారి అప్పారావు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలలో ప్రత్యేక అధికారి సరిత దేవి ఆధ్వర్యంలో నిర్వహించిన వీడ్కోలు సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. విద్యార్థులు కష్టపడి చదువుకొని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని, ప్రతి ఒక్కరూ మానసికంగా, ఆర్థికంగా, శారీరకంగా, దృఢమైన నిర్ణయాలతో విజయాలను అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం నిలిపివేయాలి

తహశీల్దార్ జానకమ్మ

ప్రజాశక్తి-కోటవురట్ల:ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిలిపి వేయాలని తహశీల్దారు జానకమ్మ తెలిపారు. సోమవారం జరగనున్న ఎన్నికలకు సిబ్బందిని అప్రమత్తం చేయడంతో పాటు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎటువంటి ప్రచారం జరగకుండా సిబ్బందిని అప్రమత్తం చేశామని ఎవరైనా ప్రచారం నిర్వహిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

అడవిలో మంటలను అరికట్టాలి

ప్రజాశక్తి-జి.మాడుగుల:అడవిలో మంటలను అరికట్టాలని చింతపల్లి డివిజన్ అటవీ శాఖ అధికారి సిహెచ్. సూర్యనారాయణ పడాల్ తెలిపారు. శనివారం అటవీ సిబ్బందితో కలిసి వన్య మృగాల సంరక్షణ, ప్లాస్టిక్ నిషేధం, అడవి మంటలపై బోర్డులను జి.మాడుగుల నుంచి చింతపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అన్నవరం అటవీ శాఖ సెక్షన్ అధికారి ఎస్.వెంకటరావు, ఎఫ్‌బీవో శ్రీనివాస ప్రసాద్, ఎబిఒ జె.దివ్య, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

ఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి -రోలుగుంట: మండలంలోని ఎంపిపి స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాన్ని నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వి.జయరాం శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, పోలింగ్ స్టేషన్‌లో అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట తహశీల్దార్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

కొత్తకోట: రావికమతంలో ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని నర్సీపట్నం ఆర్డీవో జయరాం శనివారం పరిశీలించారు. రావికమతం హైస్కూల్లో 167వ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రం వద్ద విద్యుత్, తాగునీరు, బందోబస్తు ఏర్పాట్లపై తహసీల్దార్ మహేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరం వరకూ ఏ వాహనాలు నిలపరాదన్నారు. కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వ ఉద్యోగులెవ్వరూ పోలింగ్ ఏజెంట్లుగా ఉండరాదన్నారు. ఓటర్‌గా ఉన్నవారే ఏజెంట్లుగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రంలోకి ప్రజాప్రతినిదులను అనుమతించవద్దని ఆధికార్లకు సూచించారు. ఆయన వెంట ఆర్ ఐ చినబాబు తదితరులు పాల్గొన్నారు.

48 గంటల పాటు ప్రచారం నిషేధం

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులతో కలెక్టర్ సమావేశం

ప్రజాశక్తి-విశాఖపట్నం : జిల్లాలో ఈ నెల 13వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో 11వ తేది సాయంత్రం 4 గంటల నుంచి 13వ తేది సాయంత్రం 4 గంటల వరకు రాజకీయ స్వభావంతో కూడిన సందేశాలతో ప్రచారం చేయడం గానీ, ఫోన్ కాల్స్, పబ్లిసిటీ, అభ్యంతరకరమైన బల్క్ మెసేజ్‌లు పంపడాన్ని నిషేధిస్తూ భారత ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాలను తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా ఎ మల్లికార్జున తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో అభ్యర్థులతో పోలింగ్, ఎన్నికల నియమావళిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్లు ఎన్నికల ప్రచారంలో భాగంగా పంపే బల్క్ మెసేజ్‌లపై ఏదైనా ఉల్లంఘన జరిగితే ఎన్నికల నేరంగా తీవ్రంగా పరిగణించబడి సంబంధిత నిబంధనల ప్రకారం తగిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఓటింగ్ విధానంపై అభ్యర్థులకు వివరించారు. బ్యాలట్ పేపర్‌పై మొదటి ప్రాధాన్యత సంఖ్య ఒకటి తప్పనిసరిగా వేయాలన్నారు. ఎన్నికల సిబ్బంది ఇచ్చిన వైలెట్ స్కెచ్ పెన్‌తో మాత్రమే నంబర్స్ వేయాలన్నారు.

అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్ల కోసం సంబంధిత పోలింగ్ కేంద్రంలో 12 వ తేదీ సాయంత్రం నుంచి ఫారం 10 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కౌంటింగ్ ఏజెంట్ల కొరకు ఫారం 18 ద్వారా రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ , ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

దక్షిణలో 9372 మంది ఓటర్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో దక్షిణ నియోజకవర్గం నుంచి 9,372 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మొత్తం 14 బూత్‌లకు గానూ బూత్ నంబర్ 249లో 948 మంది ఓటర్లు, 250లో 518 మంది, 251లో 679 మంది, 252లో 516మంది, 253లో 1022 మంది, 254లో 883 మంది, 255లో 823 మంది, 256 బూత్‌లో 1296 మంది, 257లో 949 మంది, 258లో 217మంది, 259లో 290 మంది, 260లో 680మంది, 261లో 247 మంది, 262 బూత్ నెంబర్‌లో 304 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

మండలిలో ప్రజా వాణిని వినిపిస్తా

-విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలం
-పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

రిమ్స్‌లో ప్రచారం చేపడుతున్న కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, రణస్థలం

తనను గెలిపిస్తే శాసన మండలిలో ఉత్తరాంధ్ర ప్రజల వాణిని వినిపిస్తానని పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ అన్నారు. శనివారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్), వైద్య కళాశాల, రణస్థలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. బాగా వెనుకబడ్డ ఉత్తరాంధ్ర జిల్లాల్లో సరైన వైద్య సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాల ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా బాలారిష్టాలు వీడలేదన్నారు. భవనాలు నిర్మించినా మెడికల్ కళాశాల, ప్రజా వైద్యశాలలో పని చేసేందుకు సరిపడ వైద్యులు, ఇతర సిబ్బంది లేరన్నారు. కాంట్రాక్టు సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. వీరిని రెగ్యులర్ చేయాల్సిన ప్రభుత్వం ఏళ్ల తరబడి వెట్టి చాకిరి చేయిస్తోందని విమర్శించారు. జిల్లా నుంచి స్పీకర్, ఇతర శాఖల మంత్రులు ఉన్నా జిల్లాలో అభివృద్ధి కాదు కదా, మరింత వెనుకబాటుకు నెట్టబడుతోందని అన్నారు. 194 కిలోమీటర్ల సుదూర తీర ప్రాంతం కాలుష్యం బారిన పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్యాకేజీ, రైల్వేజోన్, మెట్రో రైల్ వంటి అంశాల్లో రాష్ట్రానికి కేంద్రం ద్రోహం చేసిందని అన్నారు. స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిందని చెప్పారు. దీన్ని ప్రశ్నించాల్సిన అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఆ పని చేయడం లేదని అన్నారు. ద్రోహం చేసిన కేంద్ర ప్రభుత్వంతో దోస్తీ చేస్తున్నాయని చెప్పారు. ప్రజా సమస్యలపై మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే నిలదీస్తున్నారని అన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల బలం మండలిలో ఎంత పెరిగితే పట్టభద్రులు, వివిధ తరగతుల వాణిని వినిపించే అవకాశం ఉంటుందని చెప్పారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఐద్వా నాయకులు లక్ష్మి. పాణిగ్రాహి, ఆర్.సురేష్‌బాబు, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల ప్రచారం

మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల మద్దతు

కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు జివిఎంసి ఎంప్లాయీస్ యూనియన్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్‌లు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించాయని యూనియన్ ప్రధాన కార్యదర్శి పి. వెంకటరెడ్డి తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద డాక్టర్ రమాప్రభకు మద్దతు తెలుపుతూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌తో సహా దేశాన్ని అమ్మేస్తున్న బిజెపి, గంగవరం, కృష్ణపట్నం పోర్టులను అదానికి అమ్మేసిన వైసిపి ఓట్లు అడిగే హక్కును కోల్పోయాయన్నారు. చట్టసభలలో కార్మికులు, ఉద్యోగులు, ప్రజల గురించి ప్రభుత్వాన్ని నిలదీస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. క్లాప్ డ్రైవర్స్, నీటి సరఫరా కార్మిక నాయకులు కుమార్, సురేష్, అశోక్, రవి, రాంబాబు, చిన్నబాబు, ఈశ్వరరావు, గౌతమ్ పాల్గొన్నారు.

సిఐటియు ప్లకార్డుల ప్రదర్శన

కలెక్టరేట్ : డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర ఉపాధ్యక్షుడు వై.రాజు మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర సమస్యలు, ముఖ్యంగా ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై పోరాడగలిగే డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. సిఐటియు నగర నాయకులు జి.అప్పలరాజు, ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంటలో ప్రచారం

ములగాడ: స్థానికులకు ఉపాధి, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు పాటుపడతానని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ హామీనిచ్చారు. శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా హెచ్‌పిసిఎల్ మెయిన్ గేటు వద్ద ఉద్యోగులు, కార్మికులు, పట్టభద్రుల ఓటర్లను స్వయంగా కలిసి, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హెచ్‌పిసిఎల్, ఐఒసి, బిపిసిఎల్, ఇతర ఆయిల్ పరిశ్రమలతోపాటు షిప్‌యార్డు, స్టీల్‌ప్లాంట్, ఎల్‌ఐసి, బ్యాంకులు, రైల్వేలు, ఇతర ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు కృషిచేస్తానన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీ పోస్టుల భర్తీ, కార్మికులు, ఉద్యోగులకు సకాలంలో పిఆర్‌సి అమలు, వంటి సమస్యలపై దృష్టి పెడతానన్నారు. హెచ్‌పిసిఎల్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షుడు వెంకటకృష్ణ, ప్రధానకార్యదర్శి కెఎన్ సత్యనారాయణ, ప్రభాకర్, ఎన్. రాజేష్‌నాయుడు, హరికృష్ణ నాగచైతన్య, పబ్లిక్ కోఆర్డినేషన్ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, మల్కాపురం జోన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.పెంటారావు, ఆర్.లక్ష్మణమూర్తి, జోన్ నేతలు పి.పైడిరాజు, వి.బాబూరావు, వాసు, ఎం.కృష్ణారావు, వై.గంగాధర్, ఏసుబాబు శ్రీను, సుభానీ పాల్గొన్నారు.

ఆరిలోవ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో పోటీచేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజా సంఘాల నేతలు కోరారు. శనివారం సిఐటియు, ఐద్వా, పెన్షనర్ల అసోసియేషన్, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆరిలోవ, టిఐసి పాయింట్ వద్ద గోడపత్రికలను ప్రదర్శిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ అధికార పక్షమో, విపక్షమో కాకుండా ప్రజల పక్షాననిలబడే అభ్యర్థిని ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో వి.నరేంద్రకుమార్, పి.శంకరరావు, ఎస్. రంగమ్మ, వి.కృష్ణమూర్తి, వి.కాంతం, ఐసిహెచ్.నాయుడు, కె.మోహనరావు, రత్నం, ఎ.రమణ, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

సింహాచలం: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ సింహాచల పరిసర ప్రాంతాల్లో సిపిఎం, సిఐటియు సభ్యులు విస్తృతంగాప్రచారాన్ని చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, బ్యాంకుల వద్దకు వెళ్లి పట్టభద్రుల ఓటర్లను కలిసి రమాప్రభను గెలిపించాలని కోరారు.

షిప్‌యార్డు ఉద్యోగ, కార్మిక సంఘాల మద్దతు

ములగాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమ, ప్రజాసంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు తమసంపూర్ణ మద్దతు ఉంటుందని షిప్‌యార్డు ఉద్యోగ, కార్మిక సంఘాలు స్పష్టంచేశారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ, ప్రజాకార్మిక విధానాలపై శాసనమండలిలోనూ, బయట ప్రశ్నించి పోరాడ గల సత్తా పిడిఎఫ్‌అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మాత్రమే ఉందని తామంతా సంపూర్ణంగా విశ్వసిస్తూ మద్దతు ప్రకటిస్తున్నామని షిప్‌యార్డు సిఐటియు, ఎఐటియుసి, టిఎన్‌టియుసి, హెచ్‌ఎంఎస్ ఇతర యూనియన్ల నేతలు వెల్లడించారు. సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బిఎస్‌ఎన్.రాజు, ఎస్.ప్రసాద్, ఎఐటియుసి అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు గోవింద్, బి.హరినాథ్ టియన్‌టియుసి జనరల్ సెక్రటరీ రాజా రమేష్ , గున్నయ్య, హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రటరీ కె.బాబురావు, కెకె.గోవిందరాజు, డి.మధుసూదనరావు,జి.సత్యనారాయణ ఉన్నారు.

సింహాచలంలో వెలసిన ప్రచార బ్యానర్లు

సింహాచలం: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ సింహాచలం ప్రధాన కూడలిలో ఫ్లెక్సీలు, బ్యానర్లు వెలిశాయి. ప్రజా సమస్యలపై నినదించే సత్తా ఉన్న ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ విజయంతో పంచగ్రామాల భూసమస్యకు పరిష్కారం లభిస్తుందని బ్యానర్లలో పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపైనా, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, విభజన హామీల అమలుకు రమాప్రభ గెలుపు అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు.

కొత్తకోట: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ రావికమతం మండలం దొండపూడి, కొమిరి, కవ్వగుంట తదితర గ్రామాల్లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో అనేక సమస్యలు తాండవిస్తున్నాయని, రమాప్రభను గెలిపిస్తే వీటి పరిష్కారానికి కృషి చేస్తారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, సిపిఐ మండల కార్యదర్శి జోగిరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘం నేత ఎర్రయ్య, పాడి అప్పారావు, బూరిగ నూకరత్నం, సొలం వరలక్ష్మి పాల్గొన్నారు.

రోలుగుంట: వివిధ సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలంటూ శనివారం రోలుగుంటలో ప్రజా సంఘాల నేతలు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావేత్త రమాప్రభను గెలిపించాలని కోరారు. జిల్లాల్లో అనేక సమస్యలు తాండవిస్తున్నాయని, రమాప్రభను గెలిపిస్తే అవన్నీ పరిష్కారమవుతాయని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు తెలిపారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, మడ్డు శ్రీరామ్మూర్తి, ప్రజాశక్తి భాద్యులు శంకరరావు, ఏపీ గిరిజన సంఘం నేత ఎర్రయ్య, పాడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని బిబి.పట్నం, రాజన్నపేట గ్రామాల్లో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ రమాప్రభను గెలిపించాలని శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్మిక, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి కోరారు. ఈ కార్యక్రమంలో మడ్డు శ్రీరామ్మూర్తి, మాజీ ఎంపిటిసి పోతురాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని మండలంలోని వాడవాడలా ప్రజా సంఘాల నేతలు ప్రచారం నిర్వహించారు. మండలంలోని సబ్బవరం సాయి నగర్ కాలనీ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఉపాధ్యాయులతో జరిగిన ప్రచారంలో రాష్ట్ర ఐద్వా అధ్యక్షురాలు బి. ప్రభావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలపై శాసన మండలిలో పోరాడే అభ్యర్థిని కోరెడ్ల రమాప్రభను ప్రజాసంఘాలు బలపర్చాయని, ఆ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు జక్కాన సత్యనారాయణ, జక్కాన రాము, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పాడ సత్యవతి, సీఐటీయూ నాయకులు మొల్లేటి గౌరీశ్వర రావు, ఎర్ర సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సోమ నాయుడు పట్టభద్రులను కోరారు. అచ్చుతాపురంలో ప్రైవేటు పాఠశాలలు, గ్రంథాలయంలో శనివారం ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కె తిరుపతిరావు, ఆర్ రాము, జాగర్పు నర్సింగరావు, రాజాన జగదీష్, బి రామ్ కుమార్, బత్తిన రవిశంకర్, బి రంగారావు, సిహెచ్ తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

సీలేరు : డాక్టర్ రమాప్రభకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యుటిఎఫ్ అధ్యక్షుడు దిల్సన్ బాబు, గాలకొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు, సిఐటియు మండల కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం జీకే వీధి మండలం రేంతాడలో ప్రచారం చేశారు. ఆర్‌వి నగర్, జీకే వీధిలో పట్టభద్రులను కలిసి రమాప్రభకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.



ఆరిలోవలో...